ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 14, నవంబరు 2024



జై చెన్నయ్య.. జైజై చెన్నయ్య..



కార్తీక మాసం సందర్భంగా బుధవారం మార్కాపురంలో నిర్వహించిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి తెప్పోత్సవం భక్తజనరంజకంగా సాగింది. జైచెన్నయ్య.. జైజై చెన్నయ్య నామ స్మరణ మార్మోగింది. పుష్కరిణి ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో వెలిగిపోయింది. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

6

అవినీతి అధికారి అవుట్!

- పూర్వ ఇన్‌చార్జి డీపీవో, డీఎల్‌డీవో ఉషారాణి సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీచేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ
- గాలిలో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్



ఉషారాణిని విచారిస్తున్న త్రిసభ్య కమిటీ (ఫైల్)

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో పనిచేసే ఉద్యోగుల బదిలీల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన పూర్వపు ఇన్‌చార్జి డీపీవో టి.ఉషారాణిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు డీఎల్‌డీవోగా ఉన్న ఉషారాణి ఇన్‌చార్జి డీపీవోగా ఆరునెలలు పనిచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మార్గదర్శకాలు జారీ చేసింది. వాటికి అనుగుణంగా బదిలీలను చేపట్టాల్సిన ఉషారాణి ఇష్టారీతిన వ్యవహరించారు. ప్రధానంగా జిల్లా పంచాయతీ పరిధిలో పనిచేసే గ్రేడ్-5, 6(సచివాలయం) ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడ్డారు. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు విరుద్ధంగా బదిలీల ఉత్తర్వులు జారీచేయడంతో పెద్దఎత్తున రగడ నెలకొంది. బదిలీల్లో అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రిసభ్య కమిటీని విచారణకు

మిగతా 6వ పేజీలో



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

నేటి నుంచి బంగారు బాలోత్సవాలు

- వారంరోజులు నిర్వహణ
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి వారం రోజులపాటు బంగారు బాల్యం కార్యక్రమం కింద బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ వారోత్సవాల నిర్వహణ, భాగస్వామ్యం, ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో

మిగతా 6వ పేజీలో



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీమన్నారాయణ

స్టెప్ సీఈవోగా శ్రీమన్నారాయణ

- బాధ్యతల స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యువజన సంక్షేమశాఖ (స్టెప్) ఇన్‌చార్జి ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పి.శ్రీమన్నారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావు ఇన్‌చార్జిగా ఉన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు లోకేశ్వరరావు నుంచి శ్రీమన్నారాయణ పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీమన్నారాయణ మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు.

మెప్మాలో మెక్కుడు



రెచ్చిపోతున్న రిసోర్సు పర్సన్లు

మెప్మాలో అవినీతిపర్వం షరామామూలైంది. కొందరు రిసోర్సుపర్సన్లు రెచ్చిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బోగస్ గ్రూపులతో రూ.40 కోట్లకుపైనే రుణ దోపిడీకి పాల్పడగా 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. అయితే అప్పట్లో వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు మొక్కుబడి విచారణ చేసి కేవలం ఐదుగురు ఆర్పీలపైనే చర్యలు తీసుకుని ఆ కుంభకోణాన్ని వదిలేశారు. కాగా ఈ నకిలీ గ్రూపులలో చాలామంది కీలకంగా వ్యవహరించినప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడంతో వారి ఇష్టారాజ్యమైంది. రుణ దందాను ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. పనిలో పనిగా పొదుపు గ్రూపుల నుంచి దర్జాగా మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారి హెచ్చరించినా సరే ఆగడం లేదు. పోస్టు ఉన్నప్పుడే లక్షలు దండుకోవాలి అన్నవిధంగా దూసుకుపోతున్నారు.

- రూ.8వేల వేతనం.. లక్షల్లో ఆదాయం
- నకిలీ గ్రూపులతో బ్యాంకులకు బురిడీ
- పొదుపు సంఘాలకు రుణాల మంజూరుకు మామూళ్లు
- ఎమ్మెల్యే చెప్పినా లోన్ ఇప్పించం.. కొందరు వైసీపీ ఆర్పీల తెగింపు
- ప్రశ్నించిన మహిళలపై నోరు పారేసుకుంటున్న వైనం



ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెప్మాలో కొందరు రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లు ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారు. పొదుపు సభ్యులకు అందుబాటులో ఉండి సంఘాల బలోపేతానికి అవసరమైన సమావేశాలు నిర్వహించాల్సిన వీరు రూటుమార్చి అక్రమార్జనే ధ్యేయంగా బ్యాంకులను బురిడీ కొట్టిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో నకిలీ గ్రూపులు సృష్టించి కోట్లు గోల్‌మాల్ చేసిన విషయం విదితమే. అందులో కొందరు ఆర్పీలు కీలకంగా వ్యవహరించారు. రూ.40కోట్లకుపైనే రుణ కుంభకోణం జరిగినట్లు 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన అప్పటి ఉన్నతాధికారులు దీనిపై ఎల్‌డీఎం, పౌరసరఫరాల శాఖ అధికారి, డీఆర్‌డీఏ పీడీని విచారణాధికారులుగా నియమించారు. అయితే కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు 140మంది ఆర్పీలు మెప్మాలో పనిచేస్తుండగా, ఐదుగురిపైనే చర్యలు తీసుకుని ఆ వ్యవహారాన్ని మొక్కుబడిగా ముగించేశారు. అప్పట్లో కీలకంగా వ్యవహరించిన కొందరు ఆర్పీలు తమపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రస్తుతం రెచ్చిపోతున్నారు. మళ్లీ బోగస్ దందాకు తెరలేపారు.

పేదల సొమ్ముతో భారీగా ఆస్తులు

ఆర్పీల నెల వేతనం రూ.8వేలు. అయితే రుణాల మంజూరుకు సభ్యుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారు. కొందరైతే నకిలీ గ్రూపులను సృష్టించి లక్షలాది రూపాయల రుణాలను మింగేస్తున్నారు. వారు పేద కుటుంబానికి చెందిన వారై ఉండాలని ప్రభుత్వం చెబుతుండగా, ప్రస్తుతం చాలావరకు ఆధునిక భవంతులు, అందమైన కార్లు, బంగారు ఆభరణాలతో దర్జా అనుభవిస్తున్నారు. ఇటీవల శర్మ కాలేజీ సమీపంలోని ఓ ఆర్పీ కట్టిన ఇల్లు చూసి అటువైపుగా వెళుతున్న పీడీ రవికుమార్ ఆశ్చర్యపోయినట్లు సమాచారం. అలాంటి వారు నగరంలో చాలామంది ఉన్నట్లు ఆ శాఖలో చర్చ నడుస్తోంది. వారికి గత ప్రభుత్వ హయాం బాగా కలిసొచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అవినీతి ఆర్పీలకు అండగా ఉంటూ వారికి పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను మెప్మా కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కార్యాలయంలోని కొందరు సీవోలు తమ వంతుగా సహకరిస్తున్నారు. ఇదిలా ఉంచితే ఒంగోలు నుంచి ఇటీవల కందుకూరుకు బదిలీ అయిన ఓ కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో) తాను ఒంగోలులో ఆర్పీగా

మిగతా 6వ పేజీలో

దామచర్ల చెప్పినా రుణాలు ఇవ్వం

నగరంలో ఆర్పీల అవినీతి దందాపై పొదుపు సంఘాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రెచ్చిపోయిన కొందరు ఆర్పీలు నేటికీ పనితీరు మార్చుకోలేదు. ఇటీవల ఓ పొదుపు సంఘానికి సంబంధించి సమాఖ్యలో రుణం ఇవ్వాలని సభ్యురాలు అడిగితే వైసీపీ ముద్ర ఉన్న ఆర్పీ దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. 'ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పినా రుణం ఇవ్వం.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి' అంటూ నెలరోజులపాటు తన ఇంటి చుట్టూ తిప్పించుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా నగరంలోని అత్యధిక శాతం మంది ఆర్పీలు పొదుపు మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సీనియర్ గ్రూపునకు రూ.20లక్షలు మంజూరైతే కచ్చితంగా పర్సంటేజీ ఇవ్వాల్సిందే. ఎవరైనా సభ్యులు ప్రశ్నిస్తే వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. బ్యాంకులలో పొదుపు, వ్యక్తిగత రుణాల మంజూరుకు అభ్యంతరాలు తెలియజేస్తూ నానా ఇబ్బందులు పెడుతున్నారు. అలాంటి ఆర్పీలపై కనీస చర్యలు లేకపోవడం పట్ల పలువురు పొదుపు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వీయ నియంత్రణ పాటించాలి

- అంతర్జాతీయంగా పెరిగిన పొగాకు ఉత్పత్తి
- కర్ణాటక మార్కెట్లో ఇప్పటికే ఒడిదొడుకులు
- ఉత్పత్తి పెంచుకుంటే అందరం మునుగుతాం
- బోర్డు, వ్యాపారులు ఏమీ చేయలేరు
- సాగుదారులు వాస్తవ పరిస్థితిని గుర్తించి మసలుకోవాలని రైతు ప్రతినిధుల విజ్ఞప్తి



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది ప్రాంతంలో పొగాకు పండించే ప్రతి రైతు ఈ ఏడాది పంట సాగు, ఉత్పత్తిలో స్వీయ నియంత్రణ పాటించాలని రైతు ప్రతినిధులు కోరారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించి గడిచిన రెండేళ్ల ధరలు చూసి మురిసిపోయి ఎక్కువ పంటను ఉత్పత్తి చేస్తే అందరూ నష్టపోతారని హెచ్చరించారు. అధిక వ్యయ, ప్రయాసలతో పంట పండించి తీరా మార్కెట్లో సరైన


మిగతా 6వ పేజీలో

ఈతరం యోగి!

జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతున్న స్విమ్మర్

- పేదరికంలో పుట్టి హాస్టల్‌లో ఉంటూ శిక్షణ
- పట్టుదలతో రాణిస్తున్న చందవరం యువకుడు
- జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు సొంతం
- మధ్యప్రదేశ్‌లో నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక
- అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు..

7



స్విమ్మింగ్‌లో విజయం సాధించి ఆనందం వ్యక్తం చేస్తున్న యోగి రాములు (ఫైల్)



విచారణ కోసం ఎస్పీ కార్యాలయానికి వస్తున్న విజయ్‌పాల్

తెలియదు.. గుర్తు లేదు..!

- ఆర్ఆర్ఆర్ కేసులో విచారణ ప్రారంభం
- ఎస్పీ దామోదర్ ఎదుట హాజరైన రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్
- ఏడు గంటలపాటు సాగిన విచారణ
- అసలు సహకరించలేదని సమాచారం

వివరాలు మెయిన్‌లో..

ప్రపంచ స్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలు

ఒంగోలు (కల్చరల్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచస్థాయి ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు హిమబిందు చేకూరి, హరి మోటుపల్లి, బాలాజీ వీర్నాలగిరీష్ ఇయ్యపు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ పోటీలలో పాల్గొనటానికి ఎటువంటి రుసుం లేదన్నారు. విజేతలకు భారీ నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.25లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.15లక్షలు, తృతీయ బహుమతిగా రూ.10 లక్షలు, నాల్గవ బహుమతి రూ.5 లక్షలు, ఐదో బహుమతిగా రూ.2 లక్షలు ఉంటాయన్నారు. అసోసియేషన్ లింక్ ద్వారా ఈ నెల 15 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, డిసెంబరు 1 నుంచి జనవరి 15 వరకు ముగ్గుల వీడియోలు పంపవచ్చని వారు పేర్కొన్నారు.

కారుమంచి కేసు విచారణలో పురోగతి

● పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు

టంగుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని (10)పై లైంగిక దాడి కేసులో పోలీసులు పురోగతి సాధించారు. అనుమానితుడైన ఒక ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను విచారిస్తున్నారు. వారం క్రితం ఘటన చోటుచేసుకోగా బాధితురాలు నిందితుడిని గుర్తించలేకపోవడంతో విచారణలో జాప్యం జరిగింది. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు చెన్నకేశవులును ఎట్టకేలకు పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకొని ఒంగోలులోని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. బుధవారమంతా ఆయన్ను విచారిస్తూనే ఉన్నారు. చెన్నకేశవులుపై ఇప్పటికే పోక్సో కేసు కూడా నమోదు చేశారు.


పుష్కరిణిలో జరుగుతున్న తెప్పోత్సవం

తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


జలవిహారంలో చెన్నయ్య

● వైభవంగా తెప్పోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మార్కాపురం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామికి బుధవారం రాత్రి పుష్కరిణిలో భక్తజన రంజకంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో అర్చకుల బృందం వేద మంత్రాలతో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి రంగనాయక అలంకారంలో వెండి శేషవాహనంపై ప్రత్యేకంగా అలంకరించారు. మోతకాపుల చెన్నకేశవ నామస్మరణల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన తెప్పపై స్వామి వారు జలవిహారం చేశారు. మూడుసార్లు పుష్కరిణిలోని మండపం చుట్టూ జలవిహారం చేస్తుండగా భక్తులు స్వామిని దర్శించుకుని జై చెన్నకేశవ.. జైజై చెన్నకేశవ నామస్మరణలతో హోరెత్తించారు. మహిళా భక్తులు కోలాటాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పురప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. పుష్కరిణిలో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా డీఎస్పీ నాగరాజు పర్యవేక్షణలో సీఐ సుబ్బారావు, ఎస్ఐ సైదులబాబు, డివిజన్‌లోని ఎస్ఐలు, కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు.


స్వామివారికి పూజలో ఎమ్మెల్యే కందుల


ఉభయదేవేరులతో లక్ష్మీచెన్నకేశవుడు

వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సాయంత్రం వాయుకాలుష్య నియంత్రణ అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలో వాయు కాలుష్యం కలిగిన నగరాలలో కాలుష్య నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. వాటిలో ఒంగోలు నగరం ఒకటన్నారు. ఒంగోలులో వాయుకాలుష్యం వ్యాపించడంపై మూల కారణాలు తెలుసుకొని వాటి నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణకు నగరంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వాహనాల ద్వారా కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్త నిర్మూలన విధానాన్ని నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు. వాహనాలకు వినియోగించే ఇంధనం కల్తీ లేకుండా చూడాలని, ప్రతి పెట్రోలు బంకులో సరఫరా అయ్యే ఇంధనం నిబంధల మేరకు ఉందా లేదా అని అధికారులు తనిఖీలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నగరంలో వాయు కాలుష్యం వ్యాప్తి చేందే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కాలుష్యనియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవరెడ్డి, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, డీటీసీ సుశీల, డీపీఈవో శ్రీనివాసరావు, డీఎస్‌వో పద్మశ్రీ, పరిశ్రమల కేంద్రం అధికారి శ్రీనివాసరావు, మైన్స్ డీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

● 16 నుంచి శిక్షణ ప్రారంభం

● బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు అంజల

ఒంగోలు నగరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న మెగా డీఎస్సీ-2024కి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి, బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం.అంజల బుధవారం తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. 220 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ 60 రోజుల పాటు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కోసం ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాని కోరారు. ఉచిత శిక్షణతో పాటు స్టయిఫండ్, స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రకాశంభవన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయభవనంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మెప్మాలో మెక్కుడు

(5వ పేజీ తరువాయి)

ఉన్నపుడు ఉన్న పలుకుబడితో బ్యాంకర్లకు సిఫార్సులు చేస్తూ నకిలీ గ్రూపుల విషయంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

ఆర్పీల అర్హతలూ.. విధులు..

ఆర్పీగా ఉండేవారు స్వయం సహాయక సంఘ మహిళా సభ్యురాలై ఉండాలి. అంతేకాకుండా నిరుపేద కుటుంబానికి చెంది, అదే స్లమ్/పట్టణ వాసి అయి ఉండాలి. 18ఏళ్ల నుంచి 40ఏళ్ల వయస్సు కలిగి చురుగ్గా ఉండాలి. స్లమ్ లెవల్ ఫెడరేషన్‌కు కనీస 10వతరగతి, టౌన్ లెవెల్ ఫెడరేషన్‌కు ఇంటర్ విద్యార్హత తప్పనిసరి. సంఘాలలో మూడు నుంచి ఐదేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలి. వీరు సంఘంలోని పేద కుటుంబాల కోసం పనిచేయగలిగి, సభ్యుల ఆర్థికాభివృద్ధికి సమావేశాలు నిర్వహించి శిక్షణ ఇవ్వాల్సి ఉంది. సమర్థవంతగా ఉంటూ, ఆదర్శవంతమైన సభ్యురాలిగా ఉంటేనే ఆర్పీలుగా ఎంపికయ్యే అవకాశం ఉంది. ప్రత్యేకించి నిజాయితీ, సహనం, నిబద్ధత, సేవాతత్వం కలిగి, అన్నీ సంఘాల సభ్యుల ఆమోదం పొందిన వారై ఉండాలి. వాటితోపాటు మొబైల్, కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. నెలలో కనీసం 25 రోజులు సంఘ సమావేశాలు నిర్వహించి అందుకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేసినప్పుడే వారికి నెలకు రూ.8వేలు వేతనంగా చెల్లిస్తారు.

మూడేళ్లు దాటినా మార్పులు లేవు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్లమ్/పట్టణ సమాఖ్య రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)ల కాల పరిమితి మూడేళ్లు మాత్రమే. పనితీరు బాగుంటే కొనసాగించవచ్చు. లేదంటే కొత్త వారిని ఆ సమాఖ్యలు ఎంపిక చేసుకోవాలి. ప్రతి సంవత్సరం టీఎల్‌ఎఫ్‌ల పనితీరుపై సమాఖ్య మహాసభ సమావేశంలో సమీక్షించి, ఆ ఆర్పీల పనితీరు ఆధారంగా గౌరవ వేతనం నిర్ణయించాలి. వారి సేవల్లో విమర్శలు, అవినీతి, అవకతవకలు, సభ్యుల పట్ల దురుసు ప్రవర్తన, నిర్లక్ష్యం ఉన్నట్లయితే వారిని తొలగించే అవకాశం ఉంది. అయితే ఒంగోలులో 140మందికిపైగా పనిచేస్తుండగా గత పది, పదిహేనేళ్ల వాళ్లే కొనసాగుతున్నారు. కొత్తగా మార్పులేమీ లేవు. కొందరు ఆర్పీలు, అవినీతి, అక్రమాలతో కోట్లకు పడగలెత్తుతున్నా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా మెప్మాలో చోటుచేసుకున్న పరిణామాలపై ఉన్నతస్థాయి అధికారులు దృష్టిసారించి ఆర్పీల అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట వేయాలని పలువురు సభ్యులు కోరుతున్నారు.

విచారించి, చర్యలు తీసుకుంటాం



కొందరు ఆర్పీల అవినీతి, సంఘాల పట్ల నిర్లక్ష్యం, పొదుపు మహిళలపై దురుసు ప్రవర్తనపై ఇప్పటికే కొంత సమాచారం ఉంది. నిబంధనల ప్రకారం ఆర్పీలు విధుల్లో భాగంగా సంఘాల సభ్యులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి. దురుసుగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకుంటాం. రుణాల మంజూరుకు ఆర్పీలు డబ్బులడిగితే చెప్పండి. అలాంటి ఇబ్బందులు పడిన పొదుపు మహిళలు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే ఇటీవల కూడా నకిలీ గ్రూపులతో బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్న వారిపై దృష్టి సారించాం. బ్యాంకు మేనేజర్లకు పలు సూచనలు చేశాం. నకిలీ గ్రూపుల రుణాలతో మెప్మాకు ఎలాంటి సంబంధం లేదు. అలాంటి వాటికి బ్యాంకర్లదే బాధ్యత అని చెప్పాం. ఎవరైనా బోగస్ గ్రూపులు చేసి, రుణాలు తీసుకుంటే శాఖపరంగా క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకాడం.

- టి.రవికుమార్, మెప్మా పీడీ

నేటి నుంచి బంగారు బాలోత్సవాలు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వారంరోజులపాటు బంగారు బాల్యానికి శ్రీకారం-బాలోత్సవాలతో ప్రారంభం, మన హక్కులు తెలుసుకుందాం, మన కోసం మనం, మా పిల్లలు- మా బాధ్యత, సదా బాలల సేవలో, మా కళలు- మా స్వప్నాలు, చేయిచేయి కలుపుదాం-బంగారు బాల్యాన్ని అందిద్దాం అనే ఇతివృత్తాలతో ప్రత్యేక కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించడంతోపాటు ప్రజాప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తూ ర్యాలీలు, కమ్యూనిటీ సమావేశాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాలల హక్కులు, వాటి పరిరక్షణకు ఉన్న చట్టాలు, ప్రభుత్వ పథకాలు, వాటిని పొందేందుకు అర్హతలు తదితర అంశాలపై విస్తృత స్థాయిలో అన్నివర్గాలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి పోటీలలో విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి ఈనెల 20న ఒంగోలులోని మినీ స్టేడియంలో ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అలాగే జిల్లాలోని జీరో నుంచి 18ఏళ్ల బాలల హక్కుల పరిరక్షణ, వారి సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేసేలా సంబంధిత శాఖల అధికారులతో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతినెలా మొదటి శుక్రవారం గ్రామస్థాయి కమిటీ సమావేశం ఉంటుందన్నారు. రెండో శుక్రవారం మండల, మూడో శుక్రవారం డివిజన్, నాల్గో శుక్రవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఉంటుందన్నారు. డ్రాప్ అవుట్, బాలకార్మిక, బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు అనారోగ్య బాలలను గుర్తించి ప్రతి ఒక్కరి పరిస్థితికి తగినట్లుగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. విద్యావంతమైన, ఆరోగ్యకరమైన, బాల్య వివాహ రహితమైన, బాల కార్మిక రహితమైన ప్రకాశం జిల్లా ఆవిష్కృతమయ్యేలా ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రతి డివిజన్‌లోనూ ఒక మండలాన్ని ఎంపిక చేసి అందులోని గ్రామాలను చైల్డ్ ఫ్రెండ్లీగా మార్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేషు, వివిధ శాఖల అధికారులు మాధురి, కిరణ్‌కుమార్, రవికుమార్, వసుంధర, డాక్టర్ సురేష్‌కుమార్, సూరిబాబు, గాయత్రీదేవి, చిరంజీవి, అంజల, జమున పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో కలెక్టర్ సమావేశం

పిల్లల బంగారు బాల్యం కోసం జిల్లా యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయడంతోపాటు బాల్య వివాహ రహిత జిల్లా ఆవిష్కృతమవడంలో ప్రైవేటు పాఠశాలలు కూడా కలిసిరావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో బుధవారం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బంగారు బాలోత్సవాలను పండుగ వాతావరణంలో అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని సూచించారు. విద్యతోపాటు బాలల ఆరోగ్యంపైనా దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో డీఈవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవినీతి అధికారి అవుట్!

(5వ పేజీ తరువాయి)

ఆదేశించారు. ఎస్‌డీసీ లోకేశ్వరరావు విచారణ చేసి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. పరిశీలించిన ఆమె దానిని పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపారు. దీంతో ఉషారాణిని సస్పెండ్ చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉద్యోగుల బదిలీలు చేపట్టడంపై పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి ఉషారాణిపై వేటు వేశారు.

గాలిలో ఉన్న ఉద్యోగులకు ఊరట

ఉషారాణి అవినీతి, అక్రమాల కారణంగా ఎక్కడా పోస్టింగ్‌లు లభించక గాలిలో ఉన్న 56మంది ఉద్యోగులకు ఊరట కలిగేలా పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం గాలిలో ఉన్న సచివాలయ గ్రేడ్-5 ఉద్యోగులు ముగ్గురు, గ్రేడ్-6 ఉద్యోగులు 53 మందికి జీవో నెంబరు 11 ప్రకారం పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆదేశించారు. ఆమేరకు కలెక్టర్‌కు అనుమతి ఇచ్చారు. ఇప్పటికే గాలిలో ఉన్న ఉద్యోగుల వివరాలను రూపొందించిన పంచాయతీ అధికారులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు. వారికి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ఆమె ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు. అందుకు అవసరమైన ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు బుధవారం చేపట్టారు. ఈ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తిచేసే అవకాశం ఉంది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఆ ఉద్యోగులను నియమించనున్నారు.

స్వీయ నియంత్రణ పాటించాలి

(5వ పేజీ తరువాయి)


ధరలు రాక ఇబ్బందిపడాల్సి వస్తే ఆ సమయంలో పొగాకు బోర్డు, వ్యాపారులు ఏమీ చేయలేరన్న విషయాన్ని అందరూ గమనించుకోవాలన్నారు. ఆ మేరకు బుధవారం స్థానిక బోర్డు ఆర్ఎం కార్యాలయంలో దక్షిణాది ప్రాంత వేలంకేంద్రాల రైతు కమిటీ ప్రతినిధులు సమావేశంలో తీర్మానించారు. గడిచిన రెండేళ్లు ఊహించని రీతిలో మార్కెట్ పరుగులు తీసి రైతులకు లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది బ్యారన్లు, భూములకు రెట్టింపు అద్దెలు ఇచ్చి బోర్డు అనుమతి పట్టించుకోకుండా చాలా ప్రాంతాల్లో రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. దాదాపు రెట్టింపు పంట ఉత్పత్తయ్యే పరిస్థితి కనిపిస్తోంది. పెట్టుబడి ఖర్చులు కూడా ఇబ్బందిముబ్బడిగా పెరుగుతున్నాయి. అదేసమయంలో పలు ప్రపంచ దేశాలలో ఈ ఏడాది భారీగా పంట ఉత్పత్తి జరగడంతో దేశీయ పంటకు ధరలు తగ్గే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే కర్ణాటకలో మార్కెట్ ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో రానున్న ఆంధ్రా మార్కెట్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంటుందని అటు బోర్డు అధికారులు, ఇటు వ్యాపారులు చెప్తున్నారు. ఆ మేరకు వేలం కేంద్రాలు, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పంట తగ్గించాలని చెప్తున్నారు. అయినా చాలాచోట్ల సాగు పెరుగుతోంది.

సాగు తగ్గించాలని తీర్మానం

ఈ నేపథ్యంలో రైతు ప్రతినిధులు కూడా సాగు తగ్గించాలని రైతులను కోరేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా దక్షిణాదిలోని పొగాకు వేలంకేంద్రాల రైతు ప్రతినిధుల సమావేశం బుధవారం ఒంగోలులో నిర్వహించారు. ప్రస్తుతం పంట సాగు తీరు, తదనుగుణంగా ఉత్పత్తి అంచనా, కర్ణాటకలో వేలం కొనసాగుతున్న తీరు, అంతర్జాతీయ పరిణామాలను చర్చించారు. అన్నికోణాల్లో రానున్న ఆంధ్ర మార్కెట్‌లో ధరలు తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళన అందరూ వ్యక్తం చేశారు. ఇలా అయితే రైతులంతా తీవ్రంగా నష్టపోతారని ధరలు తగ్గిన సమయంలో ఎవరు ఆదుకునే అవకాశం ఉండదని తేల్చేశారు. దీంతో రైతులు స్వీయ నియంత్రణ పాటించి పంట సాగు, ఉత్పత్తి తగ్గించడం ఒక్కటే మార్గమని ఈ విషయాన్ని రైతులందరూ గుర్తించాలని సూచిస్తూ తీర్మానించారు. సమావేశంలో పొగాకు బోర్డు వైస్ చైర్మన్ పమ్మి భద్రిరెడ్డి, వడెళ్ల ప్రసాద్, గురువారెడ్డి, పోతుల నరసింహరావు, అబ్బూరి శేషగిరి, ఆళ్ళ సుబ్బారావుతోపాటు వివిధ వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు ఉన్నారు.

'ఈత'రం యోగి!

ఆ యువకుడు పేదరికంలో పుట్టాడు. తండ్రి వ్యవసాయ కూలీ. ఆర్థిక స్థోమత లేక సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ చదువు కొనసాగించాడు. ఎన్నో కష్టాలను ఈదుకుంటూ ముందుకు సాగాడు. స్విమ్మింగ్ నేర్చుకుని అందులో ప్రావీణ్యం సాధించాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక చాంపియన్‌షిప్‌లలో పాల్గొని పతకాలు చేతపట్టాడు. ఇప్పుడు జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అంతర్జాతీయ స్విమ్మర్‌గా దేశం తరపున గెలవాలనే సంకల్పంతో పోరాడుతున్నాడు. అతనే దొనకొండ మండలం చందవరం గ్రామానికి చెందిన కన్నెబోయిన యోగి రాములు. అతని విజయ ప్రస్థానంపై ఆంధ్రజ్యోతి కథనం..



జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతున్న స్విమ్మర్

- పేదరికంలో పుట్టి హాస్టల్‌లో ఉంటూ శిక్షణ
- పట్టుదలతో రాణిస్తున్న చందవరం యువకుడు
- జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు సొంతం
- మధ్యప్రదేశ్‌లో నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక
- అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు..

దొనకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందవరం గ్రామంకు చెందిన కన్నెబోయిన రాములు, గురవమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చిన్నవాడు యోగి రాములు. తండ్రి వ్యవసాయ కూలి పనులకు వెళుతుంటాడు. ఇప్పటికీ అదే పనిలో కొనసాగుతున్నాడు. యోగిరాములు స్వగ్రామంలోనే 3వ తరగతి వరకు చదువుకొని అనంతరం తర్లుబాడులోని హాస్టల్ ఉంటూ విద్యాభ్యాసం కొనసాగించాడు. చదువుకునే రోజుల్లో క్రీడల పట్ల ఆసక్తిగల రాములు రన్నింగ్‌లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయికి ఎంపికై పోటీల్లో పాల్గొని విశాఖపట్టణంలోని సెర్ప్ ఆధ్వర్యంలోని హాస్టల్‌కు ఎంపికయ్యాడు. అక్కడ స్విమ్మింగ్ క్రీడను ఎంచుకొని ముందుకు సాగాడు.



నిర్వాహకుల నుంచి సర్టిఫికెట్ పొందుతున్న యోగి రాములు (ఫైల్)

పతకాల వేటలో పైపైకి..

యోగిరాములుకు స్విమ్మింగ్‌పై ఆసక్తి ఎక్కువగా ఉండేది. 13 ఏళ్ల క్రితం ఆక్వా స్పోర్ట్స్ క్రీడాసాధికారిక సంస్థ (శాప్) నిర్వహించిన స్విమ్మింగ్ అకాడమీలో చేరాడు. కోచ్‌ల శిక్షణతో స్విమ్మింగ్‌లో ఆరితేరాడు. తనకు ఎంతో ఇష్టమైన బటర్‌ఫ్లై స్టయిల్‌ను మెరుగుపర్చుకునేందుకు ముమ్మర సాధన చేశాడు. ఫలితంగా స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించాడు. జిల్లా స్థాయిలో అనేక పతకాలు సాధించాడు. రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 200, 100, 50 మీటర్ల బటర్‌ఫ్లై స్విమ్మింగ్‌లో పతకాలు సొంతం చేసుకున్నాడు. కేవలం రాష్ట్ర స్థాయిలోనే 20కిపైగా పతకాలు సాధించాడు.

జాతీయ పోటీలకు ఎంపికై...

జాతీయస్థాయిలో 2012లో పూణేలో జరిగిన 66వ నేషనల్, 2013లో త్రివేండ్రంలో జరిగిన 67వ నేషనల్, 2014లో జరిగిన 68వ సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాడు. తృటిలో పతకాలు చేజారాయి. ఎట్టకేలకు జాతీయస్థాయి పతకం సాధించాలనే పట్టుదలతో కర్నాటక, మంగళూరులో స్విమ్మింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా నిర్వహించే 19వ నేషనల్ మాస్టర్స్ చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో పోటీపడేందుకు రాములు ఎంపికయ్యాడు. ఆ పోటీల్లో ప్రతిభ కనబరిచి టాప్ టెన్‌లో ఐదో స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం స్విమింగ్ ఫ్రీడమ్ అఫ్ ఇండియా, మధ్యప్రదేశ్‌లో స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20వ నేషనల్ మాస్టర్స్ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో పాల్గొని పోరాడుతున్న యోగి రాములు విజయం సాధించాలని ఆశిద్దాం.



అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనటమే లక్ష్యం

అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలనే లక్ష్యంతో పోరాడుతున్నాను. తగిన ప్రోత్సాహం లభించకపోయినా కఠోర శ్రమ చేస్తున్నాను. కుటుంబ పోషణ నిమిత్తం స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదిస్తాను. గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి క్రీడాకారులను తయారు చేయాలనే ఆసక్తి ఉంది.

- యోగి రాములు

కోలాహలంగా కొత్తపట్నం సముద్ర తీరం (ఫైల్)



కడలి.. కార్తీకశోభితం!

- రేపు కార్తీక పౌర్ణమి ● సముద్రస్నానాలు, జ్వాలా తోరణం ● అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ఒంగోలు (కల్చరల్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో అత్యంత విశిష్టత కలిగిన సముద్ర స్నానాలను శుక్రవారం ప్రజలు ఆచరించనున్నారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజు సముద్రస్నానం చేయటం, సముద్రతీరంలో కార్తీకదీపాన్ని వెలిగించి మహిళలు పూజలు చేయటం ఆనవాయితీ. పౌర్ణమి రోజున జ్వాలాతోరణం, సముద్రస్నానం ఎంతో విశిష్టమైనవని, వీటిని ఆచరించటం ద్వారా విశేష ఫలితాలను పొందవచ్చని పురాణాలు చెబుతున్నాయి. జిల్లాలోని కొత్తపట్నం, పాకల, మడనూరు, ఈతముక్కల, ఉమ్మడి జిల్లాలోని చీరాల ఓడరేవు తదితర ప్రాంతాల్లో ప్రజలు వేలాదిగా రేపు సముద్రస్నానాలు ఆచరించనున్నారు. ప్రజల రాకను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, పోలీసు యంత్రాగం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది.

శివాలయాల్లో జ్వాలాతోరణం

జిల్లాలోని పలు ప్రసిద్ధ శైవాలయాలతో పాటు ఒంగోలు నగరంలోని పలు శివాలయాల్లో కార్తీకపౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం నిర్వహించేందుకు ఆయా దేవస్థాన అర్చకులు, అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇక శుక్రవారం సాయంత్రం దేవాలయాల్లో జ్వాలాతోరణం జరగనుంది. మహిళలు అటు తమ ఇళ్ల వద్ద, ఇటు దేవాలయాల్లో పెద్దసంఖ్యలో వచ్చి ప్రత్యేకంగా 365 ఒత్తులతో చేసిన దీపాలను వెలిగించనున్నారు. నగరంలోని కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, తూర్పుపాలెం గంగా పార్వతీ సమేత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు పంచముఖ శివాలయం, శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిర మరకత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిర కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, గడియారం వారి వీధి రామాలయం పశుపతీశ్వర స్వామి దేవస్థానం మొదలైన అనేక చిన్న, పెద్ద శివాలయాల్లో నేడు జ్వాలాతోరణం, మహిళల కార్తీకదీపారాధన జరుగనున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

ఇక ప్రజలు సముద్రస్నానాలకు వెళ్లినప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలో పౌర్ణమి రోజున సహజంగానే అలల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కనుక ఎట్టి పరిస్థితుల్లో ఎక్కువ లోతుకు వెళ్లకూడదని, చిన్నపిల్లలను తీసుకెళ్లేవారు వారిని ఒంటరిగా వదలకుండా తమ వెంటే ఉంచుకోవాలని సూచిస్తున్నారు. పౌర్ణమి రోజు ఉదయం నుంచి సముద్రతీర ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటాయి కనుక ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధలను పాటిస్తూ ప్రజలకు ఇబ్బంది రాకుండా పోలీసు యంత్రాంగంతో సహకరించాలని కూడా జిల్లా అధికారులు సూచిస్తున్నారు.



గిద్దలూరులో వాలిన ఆస్ట్రేలియా కొంగలు

గిద్దలూరులో ఆస్ట్రేలియా కొంగలు

గిద్దలూరు పట్టణ శివారు కొత్తపల్లికి వెళ్ళే మార్గంలో ఉన్న నరవ కుంట సమీపంలోకి బుధవారం ఆస్ట్రేలియా కొంగలు తొలిసారిగా వచ్చాయి. చిన్న చిన్న నీటిమడుగుల్లోని చేపలు తింటూ కనిపించాయి. ఇవి ఆస్ట్రేలియాకు చెందిన పెయింటెడ్ స్టార్క్ (ఎర్రకాళ్ళ కొంగలు) జాతివని చెబుతున్నారు. సంతానోత్పత్తి కోసం ఆస్ట్రేలియా నుంచి వేల కిలోమీటర్ల దూరంలోని ఈ ప్రాంతానికి నవంబరు, డిసెంబరు నెలల్లో వస్తుంటాయని పక్షి ప్రేమికులు చెబుతున్నారు. రంగురంగుల రెక్కలు, పొడవాటి ఎర్రని ముక్కు, పెద్ద శరీరం, పెద్ద కళ్ళతో చూసేవారికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయి. ఈ అరుదైన పక్షులు తొలిసారి గిద్దలూరుకు రావడంతో ప్రజలు పెద్ద ఎత్తున వీక్షించారు.

-గిద్దలూరు, ఆంధ్రజ్యోతి



బ్రహ్మ గుండం కొలనును శుభ్రం చేసిన తరువాత ఆకర్షణగా కనిపిస్తున్న విష్ణుమూర్తి విగ్రహం

బ్రహ్మాండంగా..బ్రహ్మ గుండం

- కార్తీక స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు ● శుభ్రం చేయిస్తున్న కొణిదెన గ్రామస్థులు

బల్లికురవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు శకం 11వ శతాబ్దపు నాటి బ్రహ్మగుండంలో ఈ నెల 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని కొణిదెన గ్రామంలో ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మ గుండం కొలను ఉంది. ఈ గుండంలో స్నానాలు చేస్తే పాపాలు హరిస్తాయని భక్తులకు ఎంతో నమ్మకం. చోళ రాజుల కాలంనాటి నుంచి బ్రహ్మ గుండంలో ప్రతి ఏటా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో కార్తీక స్నానాలు చేసి వెళుతుంటారు. కొంతకాలం నుంచి గుండం కొలనులో గడ్డి, నాచు ఉండడంతో కార్తీక పౌర్ణమి సందర్భంగా స్నానాలు చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా గ్రామస్థులు కూలీలతో నాచును తొలగించి శుభ్రం చేయించారు. కొలను మొత్తం బ్లీచింగ్ చల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అక్కడ వసతులను కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే మహిళా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పౌర్ణమి సందర్భంగా ఇక్కడ భారీఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రహ్మ గుండంలో కొండపై నుంచి ఊట నీరు వచ్చి చేరుతుంది. అక్కడ స్నానాలు చేస్తే ఎంతో మంచి జరుగుతుందని కొణిదెన చరిత్రలో రాసి ఉందని, అందుకే తాము ఏటా స్నానాలను అచరిస్తున్నామని భక్తులు చెప్తున్నారు. బ్రహ్మ గుండం వద్ద పురాతన దేవత శిలలతో పాటు శివలింగాన్ని ఏర్పాటు చేశారు. గుండం మధ్యలో శేషపాన్పుపై విష్ణుమూర్తి విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.



బహుమతులు పొందిన విజేతలతో అకాడమీ ప్రతినిధులు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

- సింగిల్స్ విభాగంలో విశాఖ, కాకినాడ క్రీడాకారుల విజయం
- విజేతలకు అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్ అభినందనలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని లార్డ్‌కృష్ణ ఇండోర్ స్టేడియంలో ఈనెల 10వ తేదీ నుంచి మొదలైన రాష్ట్రస్థాయి అండర్-11 బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు సెమీ ఫైనల్స్, ఫైనల్స్ జరిగాయి. బాలుర సింగిల్స్‌లో ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురానికి చెందిన ఎ.హర్షిత్‌పై విశాఖపట్నానికి చెందిన కె.మోజెస్‌పై విజయం సాధించారు. బాలికల సింగిల్స్ ఫైనల్స్‌లో కాకినాడకు చెందిన కియా, ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్‌కే.రబియాపై విజయం సాధించారు. బాలుర డబుల్స్ విభాగంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్‌కే.ఆఫన్, పశ్చిమ గోదావరికి చెందిన శ్రీరామ్‌సహంత్‌లు, కె.కార్తీక్, సూర్యరాయ్‌పై విజయం సాధించారు. బాలికల డబుల్స్ విభాగంలో విశాఖపట్నానికి చెందిన ఎలియాన్, ప్రియాంక్ శ్రీపవ్యలు, ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్‌కే.రబియా, కాకినాడకు చెందిన కె.ఆధ్యపై గెలిచారు. మూడు రోజులపాటు క్రీడాభిమానులతో లార్డ్‌కృష్ణ షటిల్ అకాడమీలో క్రీడా సందడి నెలకొంది. అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్.... విజేతలు, రన్నర్స్‌కు అభినందనలు తెలిపారు. ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ ట్రోఫీలు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి మినీ బ్యాడ్మింటన్ పోటీలు ఒంగోలులో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఒంగోలులోని లార్డ్‌కృష్ణ అకాడమీలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీబీఏ కార్యదర్శి విజయ్‌కృష్ణ, పత్తిపాటి ప్రసాద్, అకాడమీ కార్యవర్గ సభ్యులు రఘుబాబు, దండు శ్రీనివాసరావు, కొడే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- విద్యార్థులకు పలు పోటీలు
- సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు



వివరాలు వెల్లడిస్తున్న కాసు ఆదిలక్ష్మి

ఒంగోలు (కల్చరల్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. బుధవారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం ఉంటుదన్నారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, డాన్స్ పోటీలు, ఫాన్సీ డ్రస్ పోటీలు, వ్యాస రచన, పాటల పోటీలు, వక్తృత్వ, క్విజ్ పోటీలు, స్టూడెంట్ టాలెంట్ షో మొదలైనవి నిర్వహిస్తామని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి, డిజిటల్ గ్రంథాలయాలు, పురోగతిలో వనితల జీవన విధానం మొదలైన అంశాలపై చర్చా వేదిక సైతం ఏర్పాటు చేశామన్నారు. ఇక పలు సాహిత్య సాంస్కృతిక సంస్థలచే ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని డిప్యూటీ లైబ్రేరియన్(ఇన్‌చార్జి), వారోత్సవాల నిర్వాహకురాలు సంపూర్ణ తెలిపారు. ముగింపు వేడుకలు ఈనెల 20వ తేదీన ఉదయం 11.30 గంటల నుంచి జరుగుతాయని, ఇందులో జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మాజీ ఐఏఎస్ దానంకు ఘన నివాళి

పెద్దనల్లకాల్వలో తృతీయ వర్ధంతి



మాజీ ఐఎఎస్ ఆఫీసర్ దానం సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, కుటుంబసభ్యులు

కంభం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం పెద్దనల్లకాల్వలో మాజీ ఐఏఎస్ అధికారి బి.దానం తృతీయ వర్ధంతిని కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. దానం సతీమణి సరోజిని, కుమారుడు అయిన సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్, సోదరులు బి.కిశోర్, బి.సునీల్, బి.అనీల్, కుటుంబసభ్యులు బుధవారం పెద్దనల్లకాల్వలోని దానం సమాధి వద్ద నివాళులు అర్పించారు. పలువురు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలోని కంభం మండలం పెద్దనల్లకాల్వలో 1942లో దళిత కుటుంబంలో జన్మించిన బి.దానం పట్టుదల, తెలివితేటలతో ఐఏఎస్‌లో విజయం సాధించారు. తాను పుట్టిన పెద్దనల్లకాల్వ అభివృద్ధికే కాక జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక పేద కుటుంబాలకు భూములు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి అప్పటి గవర్నర్ నుంచి అవార్డులు కూడా అందుకున్నారు. అంతేకాక తాను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న సమయంలో వాతావరణ కాలుష్య నివారణకు తాను పుట్టిన పెద్దనల్లకాల్వలో సిమెంటు ఇటుకలతో 24 గంటల్లో గృహాలు నిర్మించి అందరిచేత శభాష్ అనిపించుకున్నారు. దానం తన 81వ ఏట 2021 నవంబరు 13న మరణించగా ఆయన పార్థివదేహానికి స్వగ్రామమైన పెద్దనల్లకాల్వలో అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతిఏటా నవంబరు 13న వర్ధంతిని కుటుంబసభ్యులు జరుపుతున్నారు. 3వ వర్ధంతిని కుమారుడు, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే కొండ్రు మురళి, గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ ఎంపీ కరణం బలరాం, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో కుండపోత


మస్తాన్‌దర్గా సెంటరులో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు


వర్షపునీరు, మురుగుతో నిండిన కొప్పోలురోడ్డు


చెరువులా మారిన కొత్తపట్నంబస్టాండు సెంటరు


కార్పొరేషన్ కార్యాలయం ఎదురు..


ఇందిరమ్మకాలనీలో..

నగర వీధులు జలమయం ● ఇబ్బందిపడిన నగరవాసులు

ఒంగోలు(కార్పొరేషన్), నవంబరు 13 : ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు బుధవారం ఒంగోలు తడిసి ముద్దయ్యింది. నగరంలోని ప్రధాన వీధుల్లో వర్షపునీరు ఏరులై పారింది. ఉదయం 8-30 గంటల నుంచి మొదలైన వాన మధ్యాహ్నం వరకు దంచికొట్టింది. మధ్య మధ్యలో తెరపిస్తూ కుండపోత వానకు నగరమంతా జలమయం అయింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, నగర ప్రధాన రహదారుల్లో మోకాళ్ళ లోతున నీరు నిలబడి చెరువులను తలపించాయి. ప్రధాన వీధులన్నీ వర్షపునీరు, మరోవైపు పొంగిన మురుగుతో ప్రవహించాయి. భాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దారావారితోట, దేవుడుచెరువు, సీఎస్‌ఆర్ శర్మాకళాశాల, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణం, ఏకలవ్యనగర్, మసాన్ దర్గా సెంటర్, జర్నలిస్ట్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప, హౌసింగ్ బోర్డు కాలనీల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు

భారీగా కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీలు, నగర వీధుల్లో వర్షపు నీరు నిచిలిన ప్రాంతాల్లో కార్పొరేషన్ అధికారులు పర్యటించారు. ఈ మేరకు కమిషనర్ వెంకటేశ్వరరావు ఆయా ప్రాంతాలకు చేరుకుని అక్కడ వర్షపు నీటిని బయటకు పంపే ప్రయత్నాలు చేశారు. నగర సుందరీకరణలో భాగంగా కొద్ది రోజులుగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతోపాటు, ప్రధాన డ్రైన్లపై నిర్మించిన ర్యాంప్‌లను తొలగించారు. అంతేగాకుండా మ్యాన్‌హోల్స్‌ను సిబ్బంది ఏర్పాటు చేశారు. దీంతో కొంత మేర వర్షపునీరు రోడ్లపై నిలవకుండా ఉండేందుకు ఉపరించింది.


వర్షపునీటితో నిండిన కర్నూలురోడ్డు

సంక్రాంతిలోపు సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణం పూర్తి

అధికారితో ముఖాముఖి

● జె.రవిబాబు, డీఈఈ, పీఆర్ కొండపి సబ్ డివిజన్



ప్రశ్న : కొండపి నియోజకవర్గానికి ఎన్ని పనులు మంజూరయ్యాయి?

జవాబు: నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సీసీరోడ్లు, సైడు డ్రైన్లు రెండూ కలిపి 90 పనుల ను ప్రభుత్వం మంజూరు చేసింది.

ప్రశ్న : నిధులు ఎంత కేటాయించింది? ఎన్ని మొదలయ్యాయి ?

జవాబు: రూ.17.16 కోట్లు మంజూరయ్యాయి. 88 పనులు ప్రారంభించాం. అన్నీ పురోగతిలో ఉన్నాయి.

ప్రశ్న : ఎప్పటిలోపు పూర్తి చేస్తారు?

జవాబు: సంక్రాంతిలో మొత్తం పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే నాలుగు పనులు పూర్తయ్యాయి.

ప్రశ్న : చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల పరిస్థితి ఏమిటి?

జవాబు: బిల్లుల చెల్లింపులో జాప్యం లేదు. చేసిన పనులను వెంటనే ఏఈలు రికార్డు చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. వారంవారం చెల్లింపులు జరుగుతున్నాయి. - కొండపి, ఆంధ్రజ్యోతి

గృహ, పట్టణ వ్యవహారాలపై మాగుంట భేటీ


మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో బుధవారం గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్, ఎన్‌సీఆర్‌టీసీ పాత్ర పై చర్చించారు. మరో వైపు గృహ, పట్టణ వ్యవహారాలకు సంబంధించి పలు అంశాలపై మాగుంట చర్చించారు. కార్యక్రమంలో గృహ, పట్టణ వ్యవహారాలశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


అభిలాషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని కృష్ణ మెమోరియల్ స్కూలులో ఆరో తరగతి చదువుతున్న కొప్పోలు అభిలాష ఈ నెల 18న గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఆర్చరీ పోటీల్లో అభిలాష పాల్గొననున్నారు. బుధవారం స్థానిక స్కూలులో జరిగిన కార్యక్రమంలో అభిలాషను కరస్పాండెంట్ వసుంధరారాణి, ప్రిన్సిపాల్ ఐ.లక్ష్మీజాహ్నవి అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం


మజ్నీబీబీకి అవార్డును అందజేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

మద్దిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బసవన్నపాలెం జడ్పీ హైస్కూలులో హిందీ ఉపాధ్యాయురాలు డాక్టర్ షేక్ మజ్నీబీబీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డును సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకున్నారు. గత 22 సంవత్సరాలుగా అత్యాధునిక పద్ధతిలో విద్యాబోధన చేస్తూ నూరు శాతం ఉత్తీర్ణతకు ఆమె కృషి చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక స్కూలులో ఆమె మాట్లాడుతూ తాను ఉత్తమ అవార్డు పురస్కారం అందుకోసం సంతోషంగా ఉందని తెలిపారు. ఆమెను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

పంట బీమా చేయించుకోవాలి

మద్దిపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు తాము సాగుచేసే పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో జి.రమేష్‌బాబు తెలిపారు. బుధవారం నేలటూరు, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ పంటకు ఎకరానికి రూ.368, మినుము పంటకు రూ.103, వరికి రూ.215, మిరపకు రూ.525, మొక్కజొన్నకు రూ.105 ప్రీమియంగా చెల్లించాలని చెప్పారు. ఇందుకోసం రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆయన కోరారు.

సింగరాయకొండలో భారీ వర్షం

సింగరాయకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలో భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో జిల్లాలోనే అత్యధికంగా 70.2మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాగునీటి చెరువుల్లో భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు భూముల్లో వరినాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

గిరిజనుల అభివృద్ధి విద్య ద్వారానే సాధ్యం

● సీఐడీ ఎస్ఐ ప్రభాకర్


సదస్సుకు హాజరైన అతిథులు, సంఘ నాయకులు

కొత్తపట్నం(ఒంగోలునగరం) నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి విద్య ద్వారానే సాధ్యమని సీఐడీ ఎస్ఐ ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపట్నం మండలం ఈతముక్కలలో రాష్ట్ర నేర పరిశోధన సంస్థ(సీఐడీ) ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్క గిరిజన విద్యార్థి పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని, అప్పుడే జాతి అభివృద్ధి చెందుతుందని పిలుపునిచ్చారు. ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలు మన రాష్ట్రంలో విజయవంతంగానే అమలు అవుతున్నాయన్నారు. చట్టాలు పట్ల అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. గిరిజనులు విద్యావంతులై రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకుని హక్కులను కాపాడుకోవాలని ఆయన సూచించారు. అనంతరం గిరిజన సంఘం నాయకుడు ఈగ శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలోని గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నివేశన స్థలాలు లేక ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉంటున్నాయని చెప్పారు. వారి భూములను ఆన్‌లైన్ చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలు అందటం లేదన్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గిరిజన సంక్షేమానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐడీ సీఐ హజరత్ బాబు, కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్, ఆర్ఐ వరకుమార్, సహాయ గిరిజన సంక్షేమశాఖాధికారి సుబ్బయ్య, ఎంఈవో తులసికుమారి, హెచ్ఎం చెంచుపున్నయ్య, గిరిజన సంఘం నాయకులు ఇండ్ల సాంబశివరావు, తుపాకుల హరి, ప్రసాద్, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల పనులు మొదలు పెట్టకుంటే రద్దు

● డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్


మాట్లాడుతున్న పీడీ జోసెఫ్‌కుమార్

సంతనూతలపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గోకులంషెడ్లకు సంబంధించి ఈనెల 16వ తేదీలోపు పనులు మొదలు పెట్టకుంటే రద్దు చేసి కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా గోకులం షెడ్లను గడుపులోపు మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. లేకుంటే కొత్త వారిని ఎంపిక చేసి వాటిపనులు ప్రారంభించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ పి.వెంకటస్వామి, ఏపీవో వాసంతి పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మద్దిపాడు: మండలంలో మంజూరైన సోకపిట్లు, క్యాటిల్ షెడ్ల నిర్మాణాలు వేగంగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడారు. ఆయా నిర్మాణాల విషయంలో మండలం వెనకబడి ఉందని చెప్పారు. ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు విధిగా సచివాలయంలో హాజరుకావాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, టీఈ కిషోర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

కొత్తపట్నం(ఒంగోలునగరం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలను ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. జిల్లా ప్రకృతి వ్యవసాయం విభాగం మేనేజర్ సుభాషిణి ఈ బృందానికి ప్రకృతి వ్యవసాయం ద్వారా గ్రామస్తులు సాగు చేస్తున్న పంటలను గురించి వివరించారు. బృందంతోపాటు రిటైర్డు ఐఏఎస్ అధికారి శ్యామల్‌ఆనంద్, హెల్త్ అండ్ న్యూట్రీషియన్ అధికారి లక్ష్మీదుర్గ, డాక్టర్ రాజగోపాల్ ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగవుతున్న పంటలను పరిశీలించారు. ఈతముక్కలలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ విధానం ద్వారా పండించిన ఉత్పత్తులను తినటం వలన వచ్చే మార్పులను వారు అడిగారు. కొత్తపట్నం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగులో ఉన్న పొలాలను పరిశీలించారు. పంట ఉత్పత్తులను గ్రామస్థులకు అందేలా వారిలో చైతన్యం కల్పించాలని శ్యామల్‌ఆనంద్ కోరారు. కొత్తపట్నంతో పాటు రంగాయపాలెం గ్రామంలో సాగును కూడా బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న 108 ఉద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తదనంతరం సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 108 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో పలువురు ఉద్యోగులు ఉన్నారు.

పేదలకు అన్నదానం

ఒంగోలు(కల్చరల్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం అన్నవరప్పాడులోని శివం ఫౌండేషన్‌లో చీమకుర్తికి చెందిన దాతలు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి ప్రారంభించారు. గొల్లపూడి రాజారావు వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులు గొల్లపూడి లక్ష్మి, గొల్లపూడి వెంకటేష్, గుర్రం బిందు, గుర్రం రాకేష్‌లు ఫౌండేషన్‌లోని అనాథలకు అన్నదానం చేశారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

మద్దిపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల అరియర్స్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు దే వరశెట్టి యలమంద కోరారు. బుధవారం మద్దిపాడులో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి నేలటూరి సత్యనారాయణ, గంటా కోటేశ్వరరావు, జి.నరసింహారావు, అబ్దుల్‌కలాం, మజీద్, కె.వెంకటేశ్వర్లు, అన్నమనేని కోటేశ్వరరావు, కె.సుబ్బారావు, చెంచయ్య పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

పొన్నలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కొండపి సీఐ జి.సోమశేఖర్ ఆదేశించారు. బుధవారం పొన్నలూరు స్టేషన్‌లో ఆయన పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో పేకాట ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సై అనూక్‌కు సూచించారు. గంజాయి, మద్యం అక్రమ అమ్మకాలపై నిఘా ఉంచాలన్నారు. రాత్రుళ్లు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

నేటి నుంచి విద్యార్థులకు పలు పోటీలు

సంతనూతలపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు గ్రంథాలయంలో ఈనెల 14నుంచి 20వ తేదీవరకు గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు పలు పోటీలు జరుగుతాయని గ్రంథపాలకుడు సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరు గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు ఎ.ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తాన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి : డీఏవో

సంతనూతలపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వేసిన పంటలను రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలని డీఏవో ఎస్.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని చిలకపాడు, పి.తక్కెళ్లపాడు గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాలకు హాజరైన ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియాన్ని రైతులు చెల్లించాలని, తద్వారా పంట నష్టపోతే పరిహారం పొందే వీలుంటుందన్నారు.

పంట మార్పిడితో అధిక దిగబడులు

టంగుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి ద్వారా రైతులు అధిక దిగుబడులతోపాటు మంచి లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.రమేష్ సూచించారు. బుధవారం మండలంలోని మర్లపాడు, కందులూరుల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏవో జి.స్వర్ణలత, డాక్టర్ సోమశేఖర్, ప్రకృతి వ్యవసాయం అధికారి విజయలక్ష్మి, ఎ.శ్రీనివాసరెడ్డి, సుజాత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మడనూరులో చోరీ

కొత్తపట్నం(ఒంగోలు నగరం) నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం మడనూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కేశవరపు కృష్ణారెడ్డి కుటుంబం తిరుపతిలో ఉంటున్న సోదరుడి గృహప్రవేశం నిమిత్తం రెండు రోజుల క్రితం వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు మంగళవారం ఇంటిలోకి ప్రవేశించి పడి కేజీ వెండి, రెండు జతల బంగారు కమ్మలు, రూ.లక్ష నగదును దోచుకుపోయారు. బుధవారం ఉదయాన్నే కృష్ణారెడ్డి ఇంటికి వెళ్ళి చూసిన బేల్దార్ లక్ష్మణ్ ఈ విషయాన్ని ఆయనకు ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో కృష్ణారెడ్డి ఇంటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తపట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిమ్స్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్


కేక్ కట్‌చేస్తున్న ప్రొఫెసర్లు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిమ్స్ మెడికల్ కాలేజీలో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం రాత్రి మెడికల్ విద్యార్థులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ వాక్యోపదేశం చేయగా, మెడికల్ విద్యార్థులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ టి.జమున, హెచ్‌వోడీ సుధాకర్‌బాబు, ఐఎంఏ కన్వీనర్ జాలాది మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నిడమనూరి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగమైన నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఒంగోలుకు చెందిన నిడమనూరి రమేష్‌బాబును నియమిస్తూ పార్టీ అధిష్టాన బుధవారం ప్రకటించింది. స్థానిక 4వ డివిజన్‌కు చెందిన రమేష్‌బాబు పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేయడంతోపాటు, ప్రస్తుతం బీసీసెల్ నగర అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు రమేష్‌ను అభినందించారు.

విద్యాసామగ్రి పంపిణీ


సామగ్రిని అందజేస్తున్న చేస్తున్న దాతలు, రోటరీ ప్రతినిధులు

చీమకుర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. మార్త్యల బాలరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారులు వెంకారెడ్డి, తిరుపతిరెడ్డి విద్యాసామగ్రిని రోటరీ క్లబ్ తరపున అందజేశారు. ప్రధానోపాధ్యాయులు టీఎల్.కాంతారావు దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కేవీ.సుధాకర్‌రావు, ప్రతినిధులు మన్నం నాగరాజు, పోకూరి రామకృష్ణారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, అంబటి వీరారెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకారెడ్డి, సత్యం, శిద్దా సుధాకర్, గడ్డం రమేష్, విజయలక్ష్మి, పిచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహారావు, వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకంతో ఎంతో ప్రయోజనం



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరావు

చీమకుర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంతో విద్యుత్ వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరమని దర్శి డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. సూర్యఘర్ పథకం, సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సును బుధవారం చీమకుర్తి పట్టణంలోని దిన్నేపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ పథకాన్ని ఎలా ఉపయోగించుకోవాలి, ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీలను వివరించారు. కార్యక్రమంలో డీఈ మోహనరావు, ఏఈ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

శ్రీగిరిలో నేడు కార్తీకమాస పూజలు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురు, శుక్రవారాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 6.30కు అంకురార్పణ, ఆచార్యవరణం, పుణ్యాహ వచనం, మృత్సంగ్రహణం, 15న అష్టోత్తర శతసహస్రకలశాభిషేకం, కుంభపూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా 2025 సంవత్సరం టీటీడీ క్యాలెండర్లు, డైరీలు దేవస్థానకౌంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని పేరొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

నాగులుప్పలపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన ఉప్పుగుండూరులో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక అంబేద్కర్‌కాలనీలో నివశిస్తున్న నలతోటి రవికి చెందిన పూరింట్లో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకొన్న ఒంగోలు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో నగదు, బంగారం, ఇంటిలోని సామగ్రి, గడ్డివామి పూర్తిగా కాలిపోయి కట్టుబట్టలతో మిగిలినట్లు బాధితుడు వాపోయాడు. గేదెలు సైతం మంటల ధాటికి గాయపడినట్లు తెలిపారు.

అపరిచిత వ్యక్తుల వద్ద ఇనుము కొనొద్దు : సీఐ

మద్దిపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల వద్ద ఇనుము, రాగి వైర్లు లాంటి వస్తువులను వ్యాపారులు కొనుగోలు చేయవద్దని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. బుధవారం మద్దిపాడులో పాత ఇనుము వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో కొన్ని గ్రానైట్ కంపెనీల నుంచి పాత ఇనుము వస్తువులు తీసుకువచ్చి వ్యాపారుల దగ్గర అమ్మకాలు చేపడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పాత ఇనుము వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి

మద్దిపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు ఉబ్బా వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండలంలోని కొలచనకోట, మల్లవరం, దొడ్డవరం గ్రామాల్లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో శారద తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో తేడాలు సరిచేయాలి


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతు

గిద్దలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వేలో భూముల కొలతలు హెచ్చు తగ్గులు వచ్చాయని, వాటిని సరి చేయాలని పలువురు రైతులు బుధవారం జరిగిన ముండ్లపాడు గ్రామసభలో రైతులు వినతిపత్రాలు అందజేశారు. అలాగే ముండ్లపాడు, బురుజుపల్లి, వెంకటాపురం ప్రాంతాలలో ఉన్న హిందూ శ్మశాన వాటికలు దురాక్రమణకు గురయ్యాయని అందులో పేర్కొన్నారు. వెంటనే ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కె.సాంబశివనాయుడు గ్రామస్థులతో కలిసి తహసీల్దార్ అంజనేయరెడ్డికి ఫిర్యాదు చేశారు.

నోటీసులు ఇవ్వకుండా చర్యలా?

ముస్సిపల్ అధికారులను ప్రశ్నించిన హైకోర్టు

చిరువ్యాపారులకు తాత్కాలిక ఊరట

గిద్దలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు పట్టణం నుంచి వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల ఆక్రమణలు తొలగించాలని ముస్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిపై పలువురు వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. షోకాజ్ నోటీసులు జారీ చేసి వారి అభిప్రాయాలను లిఖితపూర్వకంగా తీసుకోకుండా ఫైనల్ నోటీసులు ఎలా జారీ చేస్తారంటూ ముస్సిపల్ అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. చట్ట ప్రక్రియను అనుసరించకుండా అక్రమ నిర్మాణాలను తొలగించడం ఎలా కుదురుతుందని, చట్టప్రక్రియ అనుసరించే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టంగా ముస్సిపల్ అధికారులను ఆదేశించింది. దాంతో చిరువ్యాపారులకు తాత్కాలిక ఊరట లభించింది. పట్టణంలోని కుమ్మరాంకట్ట నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా చిరువ్యాపారులు బంకులు, షెడ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాలువలపై బంకులు, షెడ్లు వేసుకోవడంతో అందులో చెత్తాచెదారం తొలగించడం ముస్సిపల్ సిబ్బందికి ఇబ్బందిగా తయారైంది. దానికి తోడు చాలా ప్రదేశాలలో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతున్నది. దీనిపై ముస్సిపల్ అధికారులు రోడ్డుకిరువైపులా ఉన్న షెడ్లను, బంకులను తొలగించాలని నోటీసులు జారీ చేశారు. దాంతో కొందరు వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. గత 25 ఏళ్లుగా రోడ్డుపక్కన చిరువ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలు వెల్లదీసుకుంటున్నామని, పంచాయతీకి పన్ను కూడా చెల్లిస్తున్నామని వ్యాపారుల తరపున హైకోర్టులో తురగ సాయి సూర్య అనే న్యాయవాది వాదించారు. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా పిటిషనర్ల వివరణలు పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఫైనల్ నోటీసులు జారీ చేయడం అన్యాయమని న్యాయవాది వాదించగా ఆ వాదనలతో హైకోర్టు ఏకీభవించింది.

ముస్సిపల్ అధికారులు చట్ట ప్రక్రియను పాటించాలని, పిటిషనర్ల వివరణను పరిగణనలోకి తీసుకునే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని బుధవారం హైకోర్టు ఆదేశించింది. దీంతో తాత్కాలికంగా చిరు వ్యాపారులకు ఊరట లభించింది.

ప్రత్యామ్నాయ ఉపాధిమార్గం చూపాలి

- **అధికారులను కోరుతున్న చిరు వ్యాపారులు**


సీఐ సుబ్బారావుతో మాట్లాడుతున్న పండ్ల దుకాణాల యజమానులు

మార్కాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహదారులు, కాలువలపై ఉన్న ఆక్రమణల తొలగింపుతో రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక అయ్యప్ప స్వామి గుడి వెనుకవైపు పూలు, పండ్లు అమ్ముకునే వాళ్లకు కాలువకు వెనుకవైపు తోపుడు బండ్లపై అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఆక్రమణల తొలగింపు సమయంలో అక్కడ పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ఇప్పటికే ముస్సిపల్ అధికారులు తొలగించి శుభ్రం చేశారు. రహదారులు విశాలంగా ఉన్నందున నిర్ణీత ప్రదేశాన్ని తమకు కేటాయించాలని బుధవారం వీధి వ్యాపారులు ముస్సిపల్ కమిషనర్ నారాయణరావు, సీఐ సుబ్బారావులను కలిసి విన్నవించుకున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో దేవాలయాలకు వెళ్లే భక్తులకు పూలు, పండ్లు దొరక్క ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. శాశ్వత పరిష్కారం చూపేలోగా ప్రస్తుతానికి తాత్కాలికంగా కొన్ని నిర్దేశిత ప్రదేశాలను కేటాయిస్తే తాము వ్యాపారులు చేసుకుంటామని కోరారు. వారి ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు ప్రస్తుతానికి మురుగు కాలువలకు వెనుకవైపు, అయ్యప్పస్వామి గుడి వెనుకవైపు స్థలాన్ని కేటాయించేందుకు అంగీకరించారు. తాత్కాలికంగా మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని, త్వరలో శాశ్వత పరిష్కారం చూపితే అక్కడే అందరూ వ్యాపారాలు చేసుకోవాల్సి ఉంటుందని వ్యాపారులకు తెలిపారు.

బంకులను తొలగించకుండా చూడాలి

తహసీల్దార్‌కు యూనియన్ సభ్యుల వినతి


తహసీల్దార్ బాల కిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటోనగర్ యూనియన్ సభ్యులు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాము స్థానిక ప్రభుత్వ వైద్యశాల ప్రహరీని అనుకొని బంకులను పెట్టుకొని వివిధ చేతి వృత్తి పనులు చేసుకోని జీవనం గడుపు తున్నామని, ఆ బంకులను తొలగించకుండా చూడాలని వైపాలెం ఆటోనగర్ యూనియన్ సభ్యులు బుధవారం స్థానిక తహసీల్దార్ బాలకిషోర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రహరీ గోడ కట్టాలని తాము ఏర్పాటు చేసుకున్న బంకులను తక్షణమే తొలగించాలని అధికారులు నోటీసులు ఇచ్చారని, దీంతో తాము ఎక్కడికి పోవాలో తెలియడం లేదని అన్నారు.ప్రత్యామ్నాయ స్థలం చూపించి ఖాళీ చేయించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్వహణ హిందువులకే అప్పగించాలి


హైందవ శంఖారావం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

మార్కాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల నిర్వహణ హిందువులకే అప్పగించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక నెహ్రూబజార్‌లోని శ్రీసాయి కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం హైందవ శంఖారావం కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్కాపురం చుట్టు పక్కల ప్రాంతాల్లో దేవాలయాలకు సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. కొన్ని దేవాలయాలు దూప దీప, నైవేద్యాలకు కూడా నోచుకోవడంలేదన్నారు. హిందూ దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమతస్థులను వెంటనే తొలగించాలన్నారు. దేవాలయాల పరిసరాల్లోని దుకాణాలను హిందువులకే అప్పజెప్పాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పుల్లయ్య, జిల్లా అధ్యక్షులు ఇమ్మడిశెట్టి వీరారావు, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, జీవీ రెడ్డి, మానవత సంస్థ జిల్లా అధ్యక్షురాలు గుంటక వనజాక్షి, పట్టణ బీజేపీ మహిళా అధ్యక్షురాలు మిరియాల వాసుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

పెద్దారవీడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని హనుమాన్ జంక్షన్(కుంట)లో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గిద్దలూరు మండలం అంబవరంకు చెందిన కల్లూరి నాగలక్ష్మి(42) పెద్దారవీడు మండలం పోతపల్లికి చెందిన నాగేశ్వరరావుతో కుంటలో సహజీవనం చేస్తున్నది. నాగేశ్వరరావు కూలీ పనుల నిమిత్తం తెలంగాణాకు వెళ్లాడు. ప్రస్తుతం నాగలక్ష్మి ఒంటరిగా ఉంటుంది. బుధవారం సాయంత్రం ఆమె నివాసం ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి

పెద్దదోర్నాల,నవంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, క్షేత్ర స్థాయి అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సచివాలయ సిబ్బందికి గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పలు సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

త్రిపురాంతకం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి కె.సీజర తెలిపారు. మండలంలోని సోమేపల్లిలో పొలంపిలుస్తుంది కార్యక్రమం సందర్భంగా రైతులతో కలిసి వరి, మిరప పంటలను బుధవారం పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఈనెల 14వ తేదీ ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9959225702 నెంబరుకు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు అందించాలన్నారు.


పుల్లలచెరువులో రామాలయ కలశ ప్రతిష్ఠ చేస్తున్న పండితులు

వైభవంగా రామాలయ కలశ ప్రతిష్ఠ

పుల్లలచెరువు,నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామస్వామి వారి కలశ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది.గతంలో ఏర్పాటు చేసిన కలశం ఊడిపోవడంతో తిరిగి కలశాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు పునఃప్రతిష్ఠించారు. రెండు రోజుల పాటు వేదపండితులు శాంతి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

23న నీటి సంఘాలకు ఎన్నికలు

పొదిలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండంలోని పెద్దచెరువు, చిన్నచెరువు, రామాపురం, ఉప్పలపాడు, తీగదుర్తిపాడు 5నీటి సంఘాలకు ఈనెల 23న ఎన్నికలు జరగనున్నట్లు తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. పొదిలి నీటి సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సచివాలయాలు, మండలపరిషత్ కార్యాలయం, ముస్సిపల్ కార్యాలయాల్లో ఉంచామన్నారు. ఇరిగేషన్‌శాఖ ఇచ్చిన సర్వే ప్రకారం జాబితా తయారు చేశామన్నారు. కనుక వివిధ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో తెలియజేయాలన్నారు. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే ఆర్డీవోకు అప్పీలు చేసుకునే అవకాశం ఉందన్నారు.

కంభంలో 5 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

కంభం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా కొండలను తవ్వి అక్రమంగా మట్టిని తోలుతున్న 5 ట్రాక్టర్లు, 1 ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కంభం ఎస్సై నరసింహారావు తెలిపారు. కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని ఏనుగుకొండను ఎక్స్‌కవేటర్‌తో తవ్వి మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వాటిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. మైనింగ్ అధికారులకు అవాహనాలను అప్పచెప్పినట్లు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా బాలు

గిద్దలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా యడవల్లి బాలును నియమించినట్లు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు బండి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జ్యోతి




దర్శి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ డీవీ జ్యోతి జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఏలూరులో ఈనెల 6, 7 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జ్యోతి రెండో స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. చదువులతో పాటు క్రీడల్లో విశేషంగా రాణిస్తున్న జ్యోతిని ప్రధానోపాధ్యాయురాలు కిరణ్‌కుమారి, పీడీ మాలకొండయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలలో ప్రతిభ చూపిన జ్యోతి







ప్రజా ఇబ్బందుల దృష్ట్యా ఆక్రమణలు తొలగింపు

కనిగిరి మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు

కనిగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఇబ్బందుల దృష్ట్యా ఆక్రమణలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జోసఫ్‌దానియేల్ చెప్పారు. కనిగిరిలో బుధవారం చేపట్టిన రోడ్డు ఆక్రమణలు తొలగిస్తున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. కనిగిరి.. డివిజన్ కేంద్రంగా మారినప్పటికీ పంచాయతీ స్థాయిలో మాత్రమే ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటిలోని ప్రధాన రోడ్లలోని ఆక్రమణలను తొలగించేందుకు గత ప్రభుత్వంలోనే ప్రణాళిక సిద్ధమైందన్నారు. దాని కార్యాచరణను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు చెప్పారు. రోడ్డు వెంట ఉన్న షాపుల నిర్వాహకులకు ముందుగానే తొలగింపు విషయం తెలియచేసి వారే స్వయంగా తొలగించుకునేలా సమయం ఇచ్చామన్నారు. నిర్ణీత గడువులోగా షాపుల యజమానులు తొలగించలేకపోయారని చెప్పారు. దీంతో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు. చర్చి సెంటరులోని నలు రోడ్లలోని ఆక్రమణలను గతంలో తొలగించగా, ఫుట్‌పాత్ కింద ఉన్న భారీ డ్రైనేజీ కాలువల పూడికతీత పనులు చేపట్టామని చెప్పారు. అదేవిధంగా చెప్పులబజారులోని చర్చి గోడ వెంట ఉన్న ఆక్రమణలు కూడా గతంలో తొలగించగా, ప్రస్తుతం రెండోవైపు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు చెప్పారు. ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా నగరికంటి బసవయ్యసెంటరు నుంచి బొడ్డుచావిడి వరకు ఇంటి యజమానులకు, షాపుల నిర్వాహకులకు తొలగించకునే అవకాశం ఇచ్చి కూడా చాలా రోజులు అవుతుందన్నారు. వారు వీలైనంత త్వరగా నిర్ణయానికి రావాలని చెప్పారు. బొడ్డుచావిడి నుంచి దొరువు బజారు కూడా ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.



చెప్పుల బజారులో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

కనిగిరిలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు హర్షణీయం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డీవీ సుబ్బారెడ్డి

కనిగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డీవీ(దొడ్డా) వెంకటసుబ్బారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం కనిగిరిలో కూటమి ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమప్రాంతంలోని కనిగిరి అన్ని విధాలా వెనుకబడి ఉందన్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుతం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ప్రచార పర్యటనల్లో భాగంగా కనిగిరి ప్రాంతం అభివృద్ధికి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటై 6నెలలు కూడా గడవక ముందే వెలిగొండ పూర్తికి రూ.300 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించటం పాలనాదక్షతకు నిదర్శనమన్నారు. అదేవిధంగా నిమ్జ్ ఏర్పాటు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర.. చంద్రబాబు దృష్టికి తీసుకవెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఆ హామీ మేరకు కనిగిరి ప్రాంతంలో రిలయన్స్ బయోగ్యాస్ ఏర్పాటుకు కంపెనీతో ఒప్పందం చేయించటంపై సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కనిగిరి అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీవీఆర్ మనోహర రావు(చిరంజీవి), మైనారిటీ నాయకులు రోషన్ సంధాని, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), నంబుల వెంకటేశ్వర్లు, తమ్మినేని శ్రీనివాసుల రెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ఫిరోజ్, గంగవరపు నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, కరణం అరుణ, స్వప్న, చీకటి వెంకటసుబ్బయ్య, డీ శివకాశయ్య, దింటకుర్తి సుబ్రమణ్యం, తిరుపాలు, ఐవీ నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దొడ్డా వెంకటసుబ్బారెడ్డి

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు

దర్శి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. దర్శి పట్టణంలోని 17వ వార్డులో బుధవారం పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మంచి నీటి కొళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన చైర్మన్ పిచ్చయ్య కొళాయిలు వెంటనే ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు వలిబాబు, దినకర్ పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు

పామూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పామూరులో ఉపాధి హామీ పథకం కింద ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మంజూరు చేయించిన రూ.5 కోట్ల నిధులతో 23 సీసీ రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ ఏఈ షేక్ మస్తాన్‌వలి చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు.

పాస్టర్ల సమస్యలు పరిష్కరించండి



లక్ష్మీకి వినతిపత్రం అందిస్తున్న పాస్టర్లు

దొనకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేద పాస్టర్ల సమస్యలు పరిష్కరించాలంటూ పాస్టర్ల సంఘం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీని కోరారు. పాస్టర్లకు ప్రభుత్వ పథకాలు అందక పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు, గౌరవ వేతనాలు తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధారా నతానియేలు, ఉపాధ్యక్షులు నూనె యోహను, మురికిపూడి నాసరయ్య, మురిపూడి శ్యామ్, గురవయ్య పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ ఏడీపై విచారణ

కురిచేడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కురిచేడు పశు సంవర్ధక శాఖ ఏడీ నాగేశ్వరరావుపై మార్కాపురం డీడీ రాఘవయ్య విచారణ చేశారు. కురిచేడు పశువైద్యశాల పరిధిలో ఆవులకు లంపి వైరస్ సోకి ఆవులు మృతి చెందడంపై దినపత్రికలలో వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై జేడీ కురిచేడుకు వచ్చి పరిశీలించి వెళ్లారు. ఈ విషయమై డీడీ రాఘవయ్య బుధవారం కురిచేడుకు వచ్చారు. వైద్యశాలలో ఏడీని, సిబ్బందిని ఆయన విచారించారు. పొట్లపాడు సచివాలయ పశువైద్య సహాయకుడిని సైతం ప్రత్యేకంగా విచారించారు. విచారణ నివేదికలను జేడీకి పంపనున్నట్లు తెలిపారు.

నక్కలగండి ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు కేటాయించాలి

పామూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడులో నిర్మితమై ఉన్న నక్కలగండి ప్రాజెక్టు తూములు, కాలువల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కోరారు. అధికారుల ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను తెప్పించుకొని నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపినట్లు దారపనేని తెలిపారు. సురేష్‌ను సన్మానించిన వారిలో సింగిల్‌విండో మాజీ చైర్మన్లు బైరెడ్డి జయరామిరెడ్డి, గద్దె గంగయ్యచౌదరి, మాజీ సర్పంచ్ గోళ్ల కేశవులు, పాలపర్తి వెంకటేశ్వర్లు ఉన్నారు.

బీజేపీవి మతోన్మాద రాజకీయాలు

సీఎస్‌పురం(పామూరు) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్వార్థ రాజకీయల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయలతో పబ్బం గడుపుకొంటోందని సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ప్రతినిధి జాలా అంజయ్య చెప్పారు. సీఎస్‌పురం మండల సీపీఎం 6 మహాసభ ఎస్ తిరుపతిరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం రమేష్, పామూరు, సీఎస్‌పురం మండల కార్యదర్శులు కే మాల్యాద్రి, యు వెంకటేశ్వర్లు, ఎం రత్నారెడ్డి, యు రాజ్యలక్ష్మీ, షేక్ అజీద్‌బాష, బీ యేసురత్నం, డాలా తిరుపతయ్య, ఏ వెంకటేశ్వరరెడ్డి, పీ కొండమ్మ, కే కళమ్మ పాల్గొన్నారు.

మత్స్యశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఏవో బి.ప్రసాదరావు చెప్పారు. మండలంలోని తాళ్లూరు-1, 2 రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. సచివాలయ మత్స్యశాఖ అసిస్టెంట్ వై.ఎలీషా, వీఏఏ నాగరాజునాయక్, ఏఈవో నాగరాజు, మత్స్యకారుల సొసైటీ అధ్యక్షురాలు మెలికా అంజమ్మ, డీఏ ఉమాదేవి పాల్గొన్నారు.





ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


వెలిగండ్ల, నవంబర్ 13 : కూటమి ప్రభుత్వం రైతులను, పాడిని ప్రోత్సహించేందుకు పశుగ్రాసంపై దృష్టి సారించిందని, అందుకు ఎకరాకు వివిధ రూపాల్లో ప్రోత్సాకం అందిస్తుందని నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి చెప్పారు. వెలిగండ్ల టీడీపీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 ఎకరాల భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు, ఐదెకరాల భూమి కలిగిన సన్న, చిన్నకారు రైతులు, వ్యక్తిగతంగా రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్లు వరకు సాగు చేసుకోవచ్చన్నారు. మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, కర్నాంటి భాస్కర్ రెడ్డి, కొండు శ్రీను, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, సుంకరి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలు

పామూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని విరాట్‌నగర్‌లో గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి వేడుకలను భక్తులు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గురువారం దేవస్థాన 11వ వార్షికోత్సవం, కార్తీక వన భోజనాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు నొస్సం నాగేంద్రాచారి, దేవస్థాన గౌరవ అధ్యక్షులు బీ రామాచారి, అధ్యక్షుడు ఎం దొరసానాచారి, బాలబ్రహ్మాచారి, బీ వినోద్ బ్రహ్మం, ఎస్ చంద్రశేఖర్, పీ వెంకటాచారి పాల్గొన్నారు.

బంగారు బాలోత్సవాలను విజయవంతం చేయాలి

తాళ్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 'బంగారు బాలోత్సవాలను' విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.సుందరరామయ్య చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో సుందరరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వంవారం రోజుల పాటు బంగారు బాల్యంకు శ్రీకారం, బాలోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, ఎంఈవో-2 సుధాకర్‌రావు, ఏఎస్సై మోహన్‌రావు, ఏపీఎం దేవరాజ్, వైద్యాధికారి సిహెచ్ శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.






ఇక.. ఎన్టీఆర్ జలసిరి

- పథకాన్ని పునరుద్ధరించిన ప్రభుత్వం
- బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల కేటాయింపు
- రైతుల ఆశలు ఫలించినట్లే.. బోర్ల నిర్మాణానికి చర్యలు
- ఐదేళ్లుగా వైసీపీ హయాంలో అటకెక్కిన బోర్ల నిర్మాణం

"ఎన్టీఆర్ జలసిరి.. భూగర్భ జలాలతో పంటలు పండించుకునే వారికి వరం. రైతులకు బోరు బావులతో సాగునీటి భరోసా కల్పించేలా.. చిన్న సన్నకారు రైతుల వ్యవసాయ భూమిని సేద్యానికి అనుకూలంగా మార్చేందుకు భూగర్భ జలాలను సమర్ధవంతంగా సద్వినియోగం చేసుకునేలా బోర్ల నిర్మాణ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పట్లో ఈ పథకంలో రైతు లకు ఉచితంగా బోర్లు వేయించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకం పేరును వైఎస్ఆర్ జలసిరిగా మార్చింది. అయితే అమలులో చిత్తశుద్ధి లోపించింది. ఈ పరిస్థితుల్లో రైతులు ఐదేళ్లుగా బోర్ల నిర్మాణం కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. దరఖాస్తుల స్వీకరణతోనే వైసీపీ పాలకులు సరిపెట్టారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రత్యే కంగా నిధులు కూడా కేటాయించింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని సామాన్య రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఐదేళ్లుగా నిలిచిపోయిన వ్యవసాయ బోర్లను తిరిగి నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుం డటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు."


వ్యవసాయ బోరు

క్లస్టర్ల వారీగా బోర్ల నిర్మాణం...

క్లస్టర్	దరఖాస్తుల సంఖ్య	ఆమోదించినవి	నిర్మించినవి
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,894	1,532	134
మాచర్ల	5,061	4,170	741
వినుకొండ	2,563	1,954	200
గుంటూరు	197	157	11
తెనాలి	279	229	122
బాపట్ల	314	236	75
చీరాల	4210	3492	821


విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోరు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అటకెక్కిన బోర్ల నిర్మాణ పథకానికి కూటమి ప్రభుత్వం ఊతం ఇచ్చింది. ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. త్వరలోనే ఎన్టీఆర్ జలసిరి బోర్ల నిర్మాణం పట్టాలెక్కనుంది. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు వ్యవసాయ బోర్లు నిర్మించారు. సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేశారు. తిరిగి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే జలసిరికి నిధులు మంజూరు చేసింది. చిన్న సన్న కారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయం బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు నాడు టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరికి శ్రీకారం చుట్టి వేలాది బోర్లను నిర్మించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పథకం పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ బోర్ల నిర్మాణంపై లేకుండా పోయింది. వైఎస్ఆర్ జలకళను ఆర్భాటంగా ప్రవేశపెట్టిన పాలకులు అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపలేదు. దీంతో

(మిగతా 6వ పేజీలో..)


గతంలో టీడీపీ ప్రభుత్వ నిర్మించిన వ్యవసాయ బోరు.. సోలార్ పంపు సెటు

అనుసంధానం

- ప్రతి ఇంటికీ ఇక జియో ట్యాగింగ్
- సచివాలయ సిబ్బందితో హౌస్‌హోల్డ్ జియో మ్యాపింగ్
- విపత్తుల సమయంలో కీలకం కానున్న ట్యాగింగ్
- ఆధార్, ఫోన్ నెంబర్లతో ప్రమాదంలో ఉన్నవారిని గుర్తించే వీలు
- తద్వారా వారికి సహాయం అందించేలా చర్యలు
- బ్యాంకు ఖాతాల ఆధార్ లింకేజిపైనా ప్రత్యేక డ్రైవ్

గుంటూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనుకోని విపత్తు వచ్చింది. ఎవరు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. వారిని వెదకడం కష్టంగా మారింది. అలాంటి సమయంలో వారిని ఎలా గుర్తించాలి? ఎలా సహాయం అందించాలి? ఎలా కాపాడాలి? ఎలాంటి కమ్యూనికేషన్ లేని విపత్కర సమయాల్లో బాధితులను గుర్తించి కాపాడడం ఎలా? ఇటీవల విజయవాడ వరద విపత్తు సమయంలో ప్రభుత్వానికి ఎదురైన సమస్య ఇది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. ఎవరెవరు ఎక్కడ నివసిస్తున్నారు.. వారిని సమన్వయం చేసే ఏకైక వ్యవస్థ ఏంటి అనేదానిపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఒక వ్యక్తి పేరు, అతడి ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు లేదా ఇంటి నెంబరు.. ఇలా ఏదో ఒక నెంబరుతో వారి వివరాలు, వుండే ప్రాంతాన్ని కచ్చితంగా గుర్తించి వారికి సహాయం అందించేందుకు మార్గాన్ని కనుగొంది. అదే 'హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్' ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేస్తే ఏదో ఒక చిన్న ఆధారంతో ప్రమాదంలో చిక్కుకుపోయిన వారిని గుర్తించి తక్షణ సహాయం అందించ వచ్చని భావించింది. వరదలో కొట్టుకుపోయేవారికి గడ్డిపోచ కూడా ఆసరాగా మారినట్లు ఈ జియో ట్యాగింగ్ విధానంలో ఒక చిన్న వివరం వారి కుటుంబ సభ్యులందరినీ రక్షించే అవకాశం కల్పించబోతోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒక సారి జియో ట్యాగింగ్ అయితే తుఫానులు, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఏదో ఒక చిన్న ఆధారంతో బాధితుల వివరాలు తెలుసుకుని వారికి సహాయం అందించవచ్చు. ఒక ఇంటికి సంబంధించి ఏ చిన్న వివరం తెలిసినా ఆన్‌లైన్లో వాటిని నమోదు చేస్తే మొత్తం వివరాలతోపాటు ఆ ఇంటి లొకేషన్ కూడా కళ్ల ముందు కనిపించేలా ఈ హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌ను రూపొందిస్తోంది.

ప్రతి ఇంటికీ జియో ట్యాగింగ్..

కూటమి ప్రభుత్వం హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి ఇంటినీ ప్రభుత్వంతో అనుసంధానిస్తోంది. గతంలో సంక్షేమ పథకాల ఆధారంగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ఉండేది. ఉదాహరణకు పింఛన్లకు సంబంధించి ఒక మ్యాపింగ్, రేషన్ కార్డులకు సంబంధించి మరో మ్యాపింగ్.. అలా ఆయా పథకాలకు సంబంధించిన మ్యాపింగ్ మాత్రమే వుండేది. ఫలితంగా ఆయా పథకాల పంపిణీకి మాత్రమే అవి ఉపయోగ పడేవి. ఈ చిక్కులను తొలగించి మొత్తం వ్యవహారాన్ని ఒక చోటికి తెచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతి ఇంటిని ఆ ఇల్లు ఉండే అక్షాంశం, రేఖాంశం ఆధారంగా జియో ట్యాగింగ్ చేస్తోంది. ఈ పద్ధతి ద్వారా ఎవరెక్కడ ఉన్నారనే విషయం సెకన్లలో తెలిసిపోతుంది. ఒక వ్యక్తి, ఆ కుటుంబ సభ్యులు, వారు నివసించే ఇల్లు, ఆ ఇల్లు పూరిల్లా, రేకుల ఇల్లా, పక్కా ఇల్లా.. వంటి వివరాలు, వీధి సమాచారం సహా మొత్తం అధికారుల లాగిన్లో కనిపిస్తాయి. మ్యాపులో వారున్న

(మిగతా 6వ పేజీలో..)

జియో ట్యాగింగ్ ఇలా..

రాష్ట్రంలోని ప్రతి కుటుంబ వివరాలను ప్రభుత్వం జియో ట్యాగింగ్‌లో నమోదు చేస్తోంది. జీఎస్‌డబ్ల్యూఎస్ ఎంప్లాయిస్ మొబైల్ యాప్ అనే యాప్‌లో జియో ట్యాగింగ్ చేస్తారు. ఆ యాప్‌లో ప్రతి ఇంటి ఫొటో, డోర్ నెంబరు, లొకేషన్‌ను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అప్లోడ్ చేస్తారు. ప్రతి కుటుంబం వద్దకు సచివాలయ ఉద్యోగులు వెళ్లి ఆ కుటుంబానికి చెందిన ఇంటిని అప్లోడ్ చేసి వాటిని ధ్రువీకరించేలా కుటుంబ సభ్యుల్లో ఒకరితో ప్రత్యేక డివైజ్ ద్వారా వేలి ముద్రలు, ఫేస్, ఐరిష్ పద్ధతిలో ఆమోదం తీసుకుంటారు.

వర్షంతో.. అన్నదాతలు విలవిల

కొద్దిపాటి వర్షానికే నేలవాలిన వరి పైరు


క్రాప వద్ద వర్షం ధాటికి నేలవాలిన వరిపైరు


ధాన్యాన్ని రోడ్డుపై రాశులుగా పోసిన రైతులు

భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని అల్పపీడనం ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. వర్షంతో అన్నదాతలు విలవిలలాడారు. బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఓ మోస్తరు వర్షం కురిసింది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని ముదురు వరిపైరు కొన్ని చోట్ల పూర్తిగా నేలవాలింది. మరికొన్ని చోట్ల చెల్లాచెదురైంది. పంట కోతకు వచ్చిన తరుణంలో వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు జారీతో రైతులు కోత కోయకుండా వాయిదా వేశారు. ఆరుగాలం వ్యయ ప్రయాసలతో పండించిన పంట చేతికొచ్చే దశలో ప్రకృతి విపత్తుల వల్ల దెబ్బతినడంతో అన్నదాతలు కుంగిపోతున్నారు. వర్షం వల్ల తమపై అదనపు భారం పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వరికోతలు ప్రారంభం

కొంత మంది రైతులు వాతావరణం అనుకూలంగా లేనప్పటికీ యంత్రాలతో వరి పంటను కోత కోయడానికి ఉపక్రమించారు. బుధవారం అనంతవరం, క్రాప గ్రామాల్లో రైతులు కోత కోయించి వచ్చిన ధాన్యాన్ని రోడ్లపై రాశులుగా పోసుకుని ప్లాస్టిక్ పట్టాలతో భద్రపరుచుకుంటున్నారు. వర్షం పడినా పంట దెబ్బతిని నష్టపోతామని, ధైర్యం చేసి పంట కోత కోయించామని రైతులు చెబుతున్నారు.

అంతంత మాత్రంగా ధాన్యం ధరలు

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధాన్యాన్ని తక్కువ ధరకే అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు. గత ఏడాది వరి కోతలు ప్రారంభంలో ధాన్యం ధరలు క్వింటా రూ.1600లకు పైగా కొనుగోలు చేస్తే ప్రస్తుతం రూ.1450 లోపు అడుగుతున్నట్లుగా రైతులు చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రాలేదంటున్నారు.


క్రాప వద్ద వరి పంటను కోస్తున్న యంత్రం

పదికి పకడ్బందీగా ప్రణాళిక

- ఉమ్మడి జిల్లాలో స్టడీ అవర్స్ ప్రారంభం
- సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ
- ఇప్పటికే 90 శాతంపైగా సిలబస్ పూర్తి
- స్టడీ మెటీరియల్, అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు

గుంటూరు(విద్య), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్యాచరణ సిద్ధం అయింది. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులు దిశానిర్దేశం చేయడంతో పాఠశాలల్లో రెండు రోజుల నుంచి స్టడీ అవర్స్ ప్రారంభం అయ్యాయి. స్టడీ అవర్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థులకు సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలు నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులకు ప్రత్యేక టైమ్ టేబుల్‌ను విద్యాశాఖ సిద్ధం చేసింది.


గుంటూరులోని ఎస్‌కేబీపీఎం స్కూల్‌లో ప్రత్యేక స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

పరీక్ష ఫీజుకు 18 వరకు గడువు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మోడల్ స్కూల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలలు 375కుపైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల నుంచి ఈ ఏడాది పది పరీక్షలకు దాదాపు 45,876 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు సమాచారం. ఇప్పటికే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో దాదాపు 95 శాతం మంది పరీక్ష ఫీజు చెల్లించారు. పరీక్ష ఫీజు గడువు ఈనెల 18వ తేదీ వరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలకు సన్నద్ధత దాదాపు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ముమ్మరంగా సాగుతోంది.

90 శాతం సిలబస్ పూర్తి

పాఠశాలల్లో పదో తరగతి సిలబస్ 90శాతం పూర్తి అయింది. సిలబస్ డిసెంబరు రెండో వారంలోగా నూరుశాతం పూర్తి అవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికే విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్-1,2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల్ని గ్రేడింగ్ చేసి శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో సాయంత్రం 4.15 నుంచి 6 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల్ని చదివించడం, సందేహాలు నివృత్తి చేయడం, ముఖ్యమైన ప్రశ్నల్ని చదివించి వారంతంలో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న వారి కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు.

త్వరలో స్టడీ మెటీరియల్ పంపిణీ

పది విద్యార్థుల కోసం జడ్పీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ త్వరలో పంపిణీ చేయనున్నారు. ఇటీవల జరిగిన సాధారణ జడ్పీ సమావేశంలో ఈమేరకు జడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా పది విద్యార్థులకు పంపిణీ చేసే స్టడీ మెటీరియల్‌పై చర్చించారు. ఇందుకోసం దాదాపు రూ.40 లక్షలకుపైగా వ్యయం చేయనున్నట్లు సమాచారం. ఈ ఏడాది విద్యార్థులకు అల్పాహారం కూడా అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. యాజమాన్యాల వారీగా ఇందుకోసం ప్రభుత్వం బడ్జెట్‌నుకేటాయించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

18న మాన్యువల్ కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బి.టెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ప్రవేశాలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ఈ నెల 18వ తేదీన జరుగుతుందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ చూడాలన్నారు.

ఏపీ లా సెట్, పీజీ ఎల్.సెట్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్

పెదకాకాని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఏపీ లాసెట్ కార్యాలయంలో రెండో విడత ఏపీ లా సెట్, పీజీ ఎల్.సెట్ 2024 అడ్మిషన్స్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ శాస్త్ర కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024ను జూన్ 9న నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎ.పి. లాసెట్ కార్యాలయంలో కన్వీనర్ ఆచార్య బి.సత్యనారాయణ విడుదల చేశారు. నేటి నుంచి ఈ నెల 17 వరకు వెబ్ కౌన్సెలింగ్, రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 15 నుంచి 19 వరకు ఉంటుందన్నారు. ఈ నెల 20 నుంచి 23 వరకూ అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. వెబ్ ఆప్షన్స్‌లో మార్పు లకు ఈ నెల 24 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 26న అడ్మిషన్స్ ఎలాట్‌మెంట్ జరుగుతుందని, 27 నుంచి 29 వరకు అర్హత పొందిన అభ్యర్థులు తమకు కేటాయించిన కళాశాలలో స్వయంగా హాజరు కావాలన్నారు.

భూములను గుర్తించి నివేదిక ఇవ్వండి

- అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు
- కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ బ్యాంక్ కొరకు భూములను గుర్తించి తహసీల్దార్లు స్పష్టమైన నివేదకనివ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. రెవెన్యూఅధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఖాళీ భూములను సంరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ భూముల అభివృద్ధికి వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పది రోజుల్లో పూర్తి వివరాలు ఇవ్వాలని, అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాపట్ల డివిజన్ పరిధిలో 203.63 ఎకరాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉన్నట్లు ఆర్డీవో పి.గ్లోరియా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో 98 ఎకరాలు, చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో 90.38 ఎకరాలు ఉన్నట్లు నివేదిక అందించారు.

- జిల్లాలో 2,506 మంది ఎస్టీలకు ఆధార్‌కార్డులు లేవని వారికి వెంటనే ఆధార్‌కార్డులు ఇప్పించాలని కలెక్టర్ తెలిపారు. 255మందికి జనన ధ్రువీకరణపత్రాలు ఇవ్వాలని సూచించారు. ఆధార్‌కార్డుల సర్వేప్రక్రియ పూర్తయిన తదుపరి మండలానికి మూడు ఎస్టీ కుటుంబాలను దత్తత తీసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు. తీరప్రాంతాలలో మడ అడవులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆమొక్కలు పెరిగే ప్రాంతాలను జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. శాసనమండలి ఓటర్ల దరఖాస్తుల విచారణ సత్వరమే పూర్తి చేయాలన్నారు. బాపట్ల, కర్లపాలెం, నిజాంపట్నం మండలాలలో విచారణ జాప్యంపై ఆరా తీశారు. ఉచిత ఇసుక విధానంపై ఆరోపణలు వచ్చిన, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధరగౌడ్, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్

మౌలికవసతులు కల్పించాలి

జిల్లాలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి మరుగుదొడ్డి, తాగునీరు సౌకర్యం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. చిన్నారులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. 458 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, 190 కేంద్రాల్లో మరుగుదొడ్ల ఏర్పాటుకి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు పాల్గొన్నారు.

చీరాల వన్‌టౌన్‌కు మరో ఎస్‌ఐ

బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మి


బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మి

చీరాలటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా రాజ్యలక్ష్మి బుధవారం బాధ్య తలు స్వీకరించారు. ఈమె జిల్లా వీఆర్ నుంచి వన్‌టౌన్‌కు వచ్చారు. ఈనేపథ్యంలో సీఐ శ్రీనివాసరావు ఎస్‌ఐకు తగు సూచనలు చేశారు. అలాగే వన్‌టౌన్ సెక్టార్-2 పరిధిలో విధులు నిర్వహించనున్నారు. అలాగే ఇప్పటివరకు ఇక్కడ విధుల్లో ఉన్న ఎస్సై అజిత అనివార్య కారణాలతో సస్పెండ్ కాగా ఆమె స్థానంలో రాజ్యలక్ష్మి విధులు చేపట్టారు. వన్‌టౌన్‌లో ఇప్పటికే ఎస్సైలుగా మరో ఇద్దరు కమలాకర్, భాస్కర్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సమస్యలు వేగవంతంగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

సీఎం సహాయం నిధి చెక్కుల అందజేత


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఇద్దరు లబ్ధిదారులకు టీడీపీ నాయకులు బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చినగంజాం గ్రామానికి చెందిన తొగరు లీలాకుమారికి రూ.30,000, మేడికొండ వెంకన్నకు రూ.25,166 సీఎం సహాయ నిధి చెక్కును నాయకులు అందజేశారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, నాయకులు బెల్లంకొండ రమేష్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, షేక్ ఖాదర్‌బాషా, మాచవరపు రామాంజనేయులు, బడుగు సామేలు, షేక్ నబీషా, షేక్ మగ్బుల్, ఏసోబు, తొగరు దుర్గారావు పాల్గొన్నారు.

బడ్జెట్‌తో అభివృద్ధి పరుగులు

» సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిన ఘనత జగన్‌దే

» ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాలు అస్తవ్యస్తమయ్యాయని, వాటి బాగు, అభివృద్ధి పరుగు కోసం బడ్జెట్ కేటాయింపులు దోహదపడతాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం శాసనసభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ వైసీపీ పాలనకు కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. 2024-2025కి సంబంధించి బడ్జెట్‌ని ఎంతో సుదీర్ఘ రాజకీయం అనుభవం ఉన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమగ్ర అభివృద్ధికి బడ్జెట్ పెట్టినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో 2014లో రూ.18వేలకోట్ల లోటు బడ్జెట్‌తో రాజధాని లేని రోజుల్లో సుదీర్ఘ అనుభవంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని చక్కదిద్దారన్నారు. అందులో భాగంగా అమరావతి నిర్మాణం, పోలవరం పనుల పురుగతి ఇందుకు నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే 150 రోజుల్లో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిందన్నారు. పారదర్శక పాలనను అందించేందుకు చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఫామ్ మెకనైజేషన్ బడ్జెట్ కానీ, డ్రిప్ ఇరిగేషన్ సెంట్రల్ గవర్నమెంట్ నుంచి సబ్సిడీ కూడా కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలను గత వైసీపీ రద్దు చేసిందని ఏలూరి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి వాటిని అమలులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టడంలో చంద్రబాబు కృషి వెలకట్టలేనిదన్నారు.

23న నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలు

ఓట్ల పరిశీలన కోసం సచివాలయాలలో ఓటర్ల జాబితాలు

పంగులూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ జవహర్ కెనాల్ ఆయకట్టు పరిధిలోని నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలు ఈ నెల 23న జరుగుతాయని తహసీల్దార్ పి.సింగారావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి కొండమంజులూరు-1, కొండమంజులూరు-2, చందలూరు-1, చందలూరు-2, పంగులూరు-1, పంగులూరు-2, రామకూరు, దుద్దుకూరు, ఇంకొల్లు-1, కోలలపూడి, అద్దంకి-2, అద్దంకి-3, రావినూతల నీటి వినియోగదారుల సంఘాల ఫారం-డీ ఓటర్ల జాబితాలను మండల పరిధిలోని సంబంధిత గ్రామ సచివాలయాలలో ఈ నెల 11న వెలువరించినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు. రైతులు ఓటర్ల జాబితాలను పరిశీలించుకుని తమ అభ్యంతరాలను 14వ తేదీన జె.పంగులూరు తహసీల్దార్‌కు తెలియచేయాలని కోరారు. సంబంధిత ఎన్నికల అధికారులు ఈనెల 20న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారని, ఆయా టీసీలకు 23వ తేదీన ఎన్నికలు జరుగుతాయని సింగారావు తెలిపారు. అదేరోజు నీటి వినియోగదారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు.

ప్రజా ఇబ్బందుల దృష్ట్యా ఆక్రమణల తొలగింపు

కనిగిరి మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు

కనిగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఇబ్బందుల దృష్ట్యా ఆక్రమణలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జోసఫ్‌డానియేల్ చెప్పారు. కనిగిరిలో బుధవారం చేపట్టిన రోడ్డు ఆక్రమణలు తొలగిస్తున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. కనిగిరి.. డివిజన్ కేంద్రంగా మారినప్పటికీ పంచాయతీ స్థాయిలో మాత్రమే ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్లలోని ఆక్రమణలను తొలగించేందుకు గత ప్రభుత్వంలోనే ప్రణాళిక సిద్ధమైందన్నారు. దాని కార్యాచరణను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు చెప్పారు. రోడ్డు వెంట ఉన్న షాపుల నిర్వాహకులకు ముందుగానే తొలగింపు విషయం తెలియచేసి వారే స్వయంగా తొలగించుకునేలా సమయం ఇచ్చామన్నారు. నిర్ణీత గడువులోగా షాపుల యజమానులు తొలగించలేకపోయారని చెప్పారు. దీంతో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు. చర్చి సెంటరులోని నలు రోడ్లలోని ఆక్రమణలను గతంలో తొలగించగా, ఫుట్‌పాత్ కింద ఉన్న భారీ డ్రైనేజీ కాలువల పూడికతీత పనులు చేపట్టామని చెప్పారు. అదేవిధంగా చెప్పులబజారులోని చర్చి గోడవెంట ఉన్న ఆక్రమణలు కూడా గతంలో తొలగించగా, ప్రస్తుతం రెండోవైపు ఆక్రమణలను తొలగిస్తున్నట్లు చెప్పారు. ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా నగరికంటి బసవయ్యసెంటరు నుంచి బొడ్డుచావిడి వరకు ఇంటి యజమానులకు, షాపుల నిర్వాహకులకు తొలగించకునే అవకాశం ఇచ్చి కూడా చాలా రోజులు అవుతుందన్నారు. వారు వీలైనంత త్వరగా నిర్ణయానికి రావాలని చెప్పారు. బొడ్డుచావిడి నుంచి దొరువు బజారు కూడా ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

దర్శి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. దర్శి పట్టణంలోని 17వ వార్డులో బుధవారం పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మంచినీటి కొళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన చైర్మన్ పిచ్చయ్య కొళాయిలు వెంటనే ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు వలిబాబు, దినకర్ పాల్గొన్నారు.

పొగ రాకుండా చర్యలు

» చెత్తను వేగంగా తరలిస్తాం

» మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రషీద్

వేటపాలెం(చీరాల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రామాపురంలోని సాలిడ్ వేస్ట్‌మేనేజ్ యూనిట్‌లో వస్తున్న పొగ, యంత్రాల పని తీరును చీరాల మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ బుధవారం పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం కమిష నర్‌గారూ ఈ పొగ మాటేంటి అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. మున్సిపల్ ఏఈ, ఇన్‌స్పెక్టర్లతో కలసి రామాపురంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ చెత్త ఎందుకు తగులబడుతుంది, పొగ ఎందుకు వస్తుందని పరిశీలించిన మీదట పేరుకుపోయిన చెత్త అడుగుభాగంలో ఉష్ణోగ్రత పెరిగి పొగవస్తుందని అక్కడి సిబ్బంది తెలిపారు. అలా పొగరాకుండా డోజర్లతో తగిన చర్య లు చేపడతామన్నారు. గుంటూరు జిందాల్ ప్లాంట్‌కు చెత్తను రోజుకు మార్చి రోజు తరలించే ప్రక్రియ జరుగుతుందన్నారు. దీంతో పాటు మరో 16 మెట్రిక్ టన్నులను టిప్పర్ల ద్వారా రోజు రెండు ట్రిప్పులు అద్దె ప్రాతిపదికన తరలించేందుకు టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. మరమ్మతులకు గురైన మిషన్‌లను బాగుచేయించి పురపాలక సిబ్బందితో నడిపేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు

అద్దంకి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి సందర్భంగా బుధవారం అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో అద్దంకి గురించి అద్భుతంగా వర్ణించిన విషయాన్ని ఈ సందర్భంగా పలువురు వక్తలు వివరించారు. అద్దంకి నుంచి బ్రహ్మంగారి మఠంకు ప్రతి రోజు బస్ సర్వీసు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్య క్రమంలో దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్నపల్లి బ్రహ్మానందం, చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ఏలూరు వీరబ్రహ్మాచారి, ఉలవలపూడి రవి, అద్దంకి పట్టణ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రాకుల రామాంజనేయులు, చెన్నుపల్లి కోటిలింగాచారి, అద్దంకి నరేష్, మిద్దెబోయిన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


కాకానిపాలెం వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

తైక్వాండోలో గోల్డ్ మెడల్స్

ప్రతిభచూపిన కడవకుదురు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, కోచ్‌లు

చినగంజాం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు శ్రీవాణి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో బంగారు పతకాలు సాధించారు. తైక్వాండో ప్రకాశం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో జరిగిన 38వ సబ్ జూనియర్ బాలబాలికల తైక్వాండో జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పొట్టి శ్రీ వాణి తెలిపారు. జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలుర 25 కేజీల విభాగంలో రేవూరి అభినయ్, బాలికల 26 కేజీల విభాగంలో నాగబోయిన దివ్యభారతిలు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. జిల్లా పోటీలలో సత్తా సాటి ఈ నెల 15, 16, 17 తేదిలలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన అభినందన సభలో అభినయ్, దివ్యభారతిలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీ వాణి, ఉపాధ్యాయులు, తైక్వాండ్ కోచ్‌లు వాటుపల్లి సుబ్రహ్మణ్యం, షేక్ సుల్తాన్ భాషలు అభినందించారు.

సముద్ర స్నానాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

డీఎస్పీ మహ్మద్ మొయిన్


రిసార్ట్స్ నిర్వాహకులు, గజ ఈతగాళ్లతో డీఎస్పీ మహ్మద్ మొయిన్, సీఐ శేషగిరిరావు

కొత్తపేట (చీరాల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సముద్ర స్నానాలకు వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ మహ్మద్ మొయిన్ చెప్పారు. స్థానిక రావి సుబ్బారాయుడు, జయలక్ష్మి కల్యాణ మండపంలో బుధవారం రిసార్ట్స్ నిర్వాహకులు, గజ ఈతగాళ్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర స్నానాలకు వచ్చేవారికి అన్ని సౌకర్యాల కల్పన, అప్రమత్తం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రత్యేకంగా రిసార్ట్స్ నిర్వాహకులు నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. అంతిమంగా ఎలాంటి అపశ్రుతులకు తావులేకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అంతకు ముందు తీర ప్రాంతంలో పలు ప్రదేశాలను డీఎస్పీ, సీఐ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అనుసరించాల్సి విధివిధానాలపై అవగాహన కల్పించారు. రెవెన్యూ, పంచాయతీ, మెరైన్ అధికారులు, సిబ్బంది సంయుక్త కార్యాచరణతో చేపట్టాల్సిన ఆవశ్యతను తెలిపారు. సముద్ర స్నానాలకు వచ్చే భక్తులు పోలీస్ హెచ్చరికలను పాటిస్తూ, సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శేషగిరిరావు, ఈపురుపాలెం, వేటపాలెం ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పలు రిసార్ట్స్ నిర్వాహకులు, గజ ఈతగాళ్లు పాల్గొన్నారు.

ఇక..ఎన్టీఆర్ జలసిరి

(5వ పేజీ తరువాయి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ పథకం అమలులో చతికిల పడింది. బోరు బావుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది రైతులు వీటి నిర్మాణం కోసం ఎదురు చూశారు. భూగర్భ జలాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకునేందుకు ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని వైసీపీ పాలకులు ఐదేళ్ల రైతులకు అక్కరకు రాకుండా చేశారు. ఈ పరిస్థితుల్లో రైతుల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం తిరిగి ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అమల్లోకి తేవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గతంలో అమలు చేసినట్లుగా ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేసేందుకు సిద్ధమైంది. అర్హులైన రైతులకు బోరు నిర్మించడంతో పాటు సోలార్ పంపు సెట్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జలసిరి పథకంలో బోర్ల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయింపుపై దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేలల్లో దరఖాస్తులు పెండింగ్‌లో

టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం రైతుల కల మన వైఎస్ఆర్ జలకళ అనే నినాదంతో వైఎస్ఆర్ జలకళ పథకాన్ని రూపొందించింది. పథకానికి పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ బోర్ల నిర్మాణాన్ని అటకెక్కించింది. ఐదేళ్ల బోర్ల నిర్మాణంలో ప్రభుత్వం బొక్కాబోర్లాపడింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 15,341 మంది రైతుల దరఖాస్తులను ఆమోదించినప్పటికీ బోర్ల నిర్మాణాన్ని విస్మరించింది. బోర్ల నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూసిన అన్నదాతలకు ఆడియాసే మిగిలింది. ఈ పథకానికి ప్రధానంగా నిధుల కొరత వెంటాడింది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో బోర్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేకపోయారు. దీంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి పూడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. జలసిరి పథకాన్ని జలకళగా మార్చిన వైసీపీ ప్రభుత్వం బోర్ల నిర్మాణాలను నామమాత్రంగా కూడా చేయలేదు. పల్నాడు జిల్లాలో 10,341 మంది రైతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 8,371 దరఖాస్తులను ఆమోదించినా 1,179 బోర్లు మాత్రమే నిర్మించారు. బాపట్ల జిల్లాలో 4524 దరఖాస్తులకు 3,728 ఆమోదించారు. వీటిలో భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి 2279 దరఖాస్తులపైనే సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన వాటిలో 2105 బోర్లు నిర్మాణానికి అనుమతించారు. వీటిలో 1779 బోర్లకు పరిపాలన అనుమతి రాగా 896 బోర్లను మాత్రమే నిర్మించారు. వీటిలో 63 బోర్లు విఫలమైనట్లు గుర్తించారు. 42 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. గుంటూరు జిల్లాలో 476 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 386 ఆమోదించారు. 181 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 197 బోర్లు నిర్మాణానికి అనుమతిచ్చారు. వీటిలో 170 బోర్లకు పరిపాలన అనుమతి ఇచ్చారు. 133 బోర్లను మాత్రమే నిర్మించగా వీటిలో 34 బోర్లు పని చేయడంలేదని నిర్ధారించారు. 44 బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

అనుసంధానం

(5వ పేజీ తరువాయి)

ప్రదేశం కనిపిస్తుంది. తద్వారా వారికి అత్యవసర సహాయాన్ని అందించవచ్చు. వారిని సంరక్షించడానికి సూచనలు చేయవచ్చు.

సమస్యల సత్వర పరిష్కారం

జియో ట్యాగింగ్ ద్వారా సమస్యలను సత్వరం పరిష్కరించవచ్చు. ఒక గ్రామంలో తలెత్తిన సమస్య గురించి ఒకరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే, ఆ సమస్య పరిష్కరించాలంటే ఆ వ్యక్తి ఫోన్ నెంబరు, నివసించే ప్రాంతం ఇతర వివరాలన్నీ అధికారులు నమోదు చేసుకుంటేగానీ ఆ ప్రాంతానికి వెళ్లి ఆ సమస్య పరిష్కారం చేయలేరు. దీనికోసం ఎంతో సమయం వృథా అవుతోంది. ఫిర్యాదులో ఇచ్చే మొబైల్/ఆధార్ నెంబర్ ఆధారంగా ఒక్క సెకనులో ఫిర్యాదుదారు అడ్రస్‌ను కనుగొనేందుకు ఈ పద్ధతిలో వీలు కలుగుతుంది. ఆధార్ నెంబర్ ఒకసారి నమోదు చేస్తే చాలు.. మొత్తం వివరాలు అధికారుల ముందుకు వచ్చేస్తాయి. ఆ వ్యక్తి ఉండే ప్రాంతాన్ని నేరుగా మ్యాపులోనే చూడవచ్చు. తద్వారా నేరుగా ఆ ప్రాంతానికి చెందిన అధికారులకు ఆ బాధ్యత అప్పగించి సత్వరమే సమస్యలు పరిష్కరించవచ్చు.

ఒక్కో ఉద్యోగికి 160 ఇళ్ల బాధ్యత

ప్రభుత్వం చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ బాధ్యతను సచివాయల ఉద్యోగులకు అప్పగించింది. ఒక్కో ఉద్యోగి రెండు క్లస్టర్లలో హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఒక్కో ఉద్యోగి 100 నుంచి గరిష్ఠంగా 160 ఇళ్లను జియో ట్యాగింగ్ చేయనున్నారు. గత మంగళవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవగా గుంటూరుజిల్లాలో 7,32,187 ఇళ్లకుగానూ 1,20,151 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తయింది. ఇంకా 6,12,036 ఇళ్లకు జియో ట్యాగింగ్ చేయాల్సి వుంది. పల్నాడు జిల్లాలో 7,04,609 ఇళ్లకుగానూ 2,00,478 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తవగా, 5,04,131 ఇళ్లకు ట్యాగింగ్ చేయాల్సి వుంది. బాపట్ల జిల్లాలో 5,52,503 ఇళ్లకుగానూ 2,19,895 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తవగా, 3,32,608 ఇళ్లకు ట్యాగింగు చేయాల్సి వుంది.

బ్యాంకు లింకేజీపై స్పెషల్ డ్రైవ్

నేషనల్ పెన్షన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌పీసీఎల్) కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు లింకేజీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలు ఆధార్, మొబైల్ నెంబర్లతో అనుసంధానం అయ్యాయా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తోంది. బ్యాంకుకు ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానం కానివారి వివరాలను ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల లాగిన్లకు పంపించారు. ఇలా బ్యాంకు లింకేజీ చేయని వారి వివరాలు తెలుసుకుని, వారికి విషయాన్ని తెలియజేసి ఆధార్ లింక్ చేసుకోవాలని ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుడికి అందించేలా డీబీటీ పద్ధతికి ప్రభుత్వం ప్రాధాన్యాన్ని పెంచింది.

ముఖాముఖి

అసభ్య పోస్టులు పెడితే చర్యలు

జీవీ చౌదరి, ఎస్‌ఐ, బల్లికురవ



ప్రశ్న : సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : సోషల్ మీడియాలో ఎవరైనా ఇష్టానుసారంగా మహిళలను, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కించపరుస్తూ పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే బల్లికురవ గ్రామ సర్పంచ్ ఫిర్యాదు మేరకు పల్నాడు జిల్లాకు చెందిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశాం.

ప్రశ్న : సైబర్ మోసాలు రోజు రోజుకు పెరుగుతన్నాయి కదా?

జవాబు : గ్రామాలలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కొత్త వ్యక్తులు ఎవరైనా ఫోన్‌లు చేసి వివరాలు అడిగినా, బ్యాంకుల వివరాలు అడిగినా చెప్పవద్దని గ్రామదర్శినిలో ప్రజలకు వివరిస్తున్నాం. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలి. కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాలకు వస్తే వెంటనే సమాచారం అందించాలి.

ప్రశ్న : గ్రామాలలో వ్యవసాయ మోటార్ల చోరీలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు : గ్రామాలలో వ్యవసాయ మోటార్ల చోరీలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం, రైతులు పొలాల్లో ఉన్న విలువైన వస్తువులను ఇంటికి తెచ్చుకోవాలి. అలానే రైతులందరూ కలిసి కాపాలాదారులను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రుళ్ల పోలీసు బీట్ కొనసాగిస్తున్నాం. ఎక్కడైనా పొలాల్లో రాత్రుళ్ల సంచరిస్తుంటే వెంటనే సమాచారం ఇవ్వాలి.

ప్రశ్న : గ్రామాలలో సీసీ కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయి?

జవాబు : కొన్ని గ్రామాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేస్తుండగా, కొన్ని పని చేయడం లేదు. అన్నింటినీ వినియోగంలోకి తీసుకు వచ్చి నిఘాను పెంచుతాం. అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : పెండింగ్ కేసులు జాప్యంపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు : పెండింగ్ కేసుల పురోగతి మెరుగ్గా ఉంది. ఇప్పటికే సిబ్బందిని ఏర్పాటు చేసి పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. లోక్ అదాలత్ ద్వారా పలు కేసులు రాజీలు అవుతున్నాయి.

ప్రశ్న : ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు : బల్లికురవ మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఉదయం, సాయంత్రం వేళ తమ సిబ్బందితో ప్రత్యేక గస్తీని ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా రోడ్లపైకి వచ్చి తోపుడు బండ్లు పెడితే వారిపై చర్యలు తప్పవు. ఇప్పటికే పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చాం. వ్యాపారులు కూడా తమకు సహకరించాలి.

ప్రశ్న : ప్రజలతో మైత్రి భావం కొనసాగిస్తున్నారా?

జవాబు : గ్రామాలలో ప్రతి రోజు పర్యటిస్తున్నాం. ప్రజలతో మైత్రి సమావేశాలు నిర్వహిస్తున్నాం. వారి సమస్యలను తెలుసుకుంటున్నాం. చట్టాల గురించి వారికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని సిబ్బందికి సూచిస్తున్నాం.

పీఎం సూర్యఘర్‌ను వినియోగించుకోవాలి

విద్యుత్ ఎస్‌ఈ ఆంజనేయులు


రిజిస్ట్రేషన్ పత్రాలను వినియోగదారులకు అందచేస్తున్న ఎస్‌ఈ ఆంజనేయులు.

పంగులూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకం ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులకు సోలార్ గ్రిడ్ ఏర్పాటుకు కేంద్రం ఇచ్చే రాయితీని వినియోగించుకోవాలని జిల్లా విద్యుత్ ఎస్‌ఈ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో విద్యుత్ వినియోగదారులకు సూర్యఘర్ పథకంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం వినియోగానికి ముందుకొచ్చిన ఆరుగురు వినియోగదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తానరావు, సబ్ డివిజన్ డీఈఈ దామోదరం, ఏఈ ఆంజనేయులు, ఏఈ టెక్నికల్ బాలకోటేవ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

66 మందిపై అపరాధ రుసుం

మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ విజిలెన్స్ అధికారుల నేతృత్వంలో బుధవారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. అదనపు లోడు వినియోగించుకుంటున్నట్లు గుర్తించిన 64 మందితో పాటు అనధికారికంగా విద్యుత్ వాడుతున్న మరో నలుగురిపై రెండు లక్షలా 84 వేల రూపాయలు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఈ జి.ఆంజనేయులు, ఈఈ మస్తానరావు, డీఈఈ దామోదరం, మార్టూరు సబ్ డివిజన్ డీఈఈ సురేంద్రబాబు, అన్ని మండలాల ఏఈలు పాల్గొన్నారు.

మైనర్ మరమ్మతులూ పట్టించుకోరు

» ప్రమాదకరంగా గుంతలు

» హైవే అధికారుల తీరుపై ప్రజల అసహనం



మార్టూరులో పెద్ద అండర్ పాస్ వద్ద ఉన్న గుంతలు

మార్టూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్లపై ఏర్పడిన చిన్న చిన్న గుంతల మరమ్మతులను కూడా హైవే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మార్టూరు సెంటర్లో పెద్ద అండరుపాస్, రెండు చిన్న అండరు పాస్‌లను, వాటికి అనుసంధానంగా సర్వీసు రోడ్డులను ఏర్పాటు చేశారు. ఈ రోడ్లపై ఏర్పడిన చిన్నపాటి గుంతలను కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. వాటి వలన హైవే అధికారులు పెద్దగా ప్రమాదాలు జరగవని బావించారో ఏమో గానీ, ప్రస్తుతం ఈ గుంతల కారణంగానే ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా స్కూటీలపై వెళ్లే మహిళలు, యువతులు ఈ గుంతలు వద్ద వాహనాన్ని కంట్రోలు చేయలేక పడిపోతున్నారు. అదీగాక సాధారణ సమయంలో కాకుండా వర్షం కురిసిన సమయంలో గుంతలపై వర్షపు నీరు నిలబడి ఉండడంతో, అక్కడ గుంత ఉన్న విషయం తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల వరుసగా వర్షాలు కురిసిన సమయంలో ఈ గుంతలు ఉన్న విషయం తెలియక చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. మార్టూరులో పెద్ద అండర్‌పాస్ వద్ద ప్రమాదకరమైన మూడు గుంతలు ఉన్నాయి. అదేవిధంగా నాగరాజుపల్లి సెంటరు సమీపంలో, పెద్ద అండరుపాస్‌కు సమీపంలోని సర్వీసు రోడ్డులో రెండుమూడు చోట్ల ఏర్పడిన గుంతలు వద్ద ఇప్పటికే చాలామంది ద్విచక్రవాహనదారులు పడిపోయారు. అందువలన చిన్న గుంతలు వద్ద హైవే అధికారులు మరమ్మతులు చేపడితే ప్రమాదాలు జరగవని వాహనదారులు అంటున్నారు.


నాగరాజుపల్లి సర్వీసురోడ్డు వద్ద ప్రమాదకరంగా గుంతలు



చందలూరులో త్రీఫేజ్ సరఫరా కోసం ఏర్పాటు చేస్తున్న 11 కేవీ లైన్

ఆర్డీఎస్ఎస్‌తో విద్యుత్ సరఫరా

- గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్ సేవలకు ఏర్పాట్లు
- 11 కేవీతో తీరనున్న లోవోల్టేజీ సమస్య

పంగులూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా నిరంతరం త్రీ ఫేజ్ విద్యుత్ సేవలందించేందుకు 11 కేవీ లైన్‌ను నిర్మిస్తున్నారు. పంగులూరు సబ్ స్టేషన్ పరిధిలో బూదవాడ ఫీడర్ కింద బూదవాడ, కల్లంవారిపాలెం, చినమల్లవరం, చందలూరు ఫీడర్ కింద ఆరికట్లవారిపాలెం, చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో నూతనంగా 11కేవీ లైన్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటితోపాటు సింగిల్ ఫేస్ ట్రాన్స్ ఫారమ్‌ల స్థానంలో త్రీ ఫేస్ ట్రాన్స్‌ఫారమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇది పూర్తయితే గ్రామాలలో లోవోల్టేజీ సమస్య ఉండదని, వ్యవసాయ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు, మంచినీటి సరఫరాకు నిరంతరాయంగా కరెంట్ పొందే అవకాశం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

అద్దంకిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు తగు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఎం.హేమమాధురి అన్నారు. బుధవారం అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆమె ఆశ్రమంలోని విద్యార్థులను పరీక్షించారు. వివిధ రుగ్మాతలతో బాధపడుతున్న వారిని వైద్యశాలలకు రిఫర్ చేశారు. కార్యక్రమాన్ని డీఐవో టి.వెంకటేశ్వర్లు సందర్శించి వైద్యులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాడరేవులో సాగర హారతి



సాగర హారతి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు



సాగర హారతికి శ్రీకారం చుట్టిన పండితులు (ఫైల్)

- కార్తీక పౌర్ణమి సందర్భంగా చీరాల ప్రాంతంలో తొలిసారిగా కార్యక్రమం
- హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో హైందవ శంఖారావం
- గడియార స్తంభం సెంటర్లో వీరరాఘవస్వామి ఆలయం వద్ద కరపత్రాల ఆవిష్కరణ

చీరాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 15వ తేదీన జరగనున్న హైందవ శంఖారావం సభకు సన్నాహంగా చీరాల మండలం వాడరేవు సముద్ర తీరంలో ఆంజనేయస్వామి విగ్రహం ఎదురు రేపు సామూహిక సాగర హారతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో చీరాల ప్రాంతంలో తొలిసారిగా సామూహిక సాగర హారతి కార్యక్రమానికి శ్రీకారం పలికినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం చీరాల గడియార స్తంభం సెంటర్లోని వీరరాఘవస్వామి దేవస్థానం వద్ద అందుకు సంబంధించిన కరపత్రాలను అన్నదానం చిదంబరశాస్త్రి తదితరులు ఆవిష్కరించారు. దీనికి సంబంధించి గత సోమవారం రాత్రి వాడరేవు సముద్ర తీరంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం ఎదురుగా పండితులు, భక్తులు సాగర హారతి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అత్యంత నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో, నిర్వహించారు. శ్రీ కామాక్షికేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్, బండారు జ్వాలానరసింహం, భజన మండలి మహిళలు, వేద పండితులు కారంచేటి నగేష్‌కుమార్, వెంకటేష్ ముందుగా శాస్త్రోక్తంగా శివపార్వతుల పూజ అనంతరం సాగర హారతికి సంకల్పం పలికారు. ఆ క్రమంలో తొలిసారిగా సాగర హారతి కార్యక్రమం జరగనుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం వాడరేవు తీరంలో 4 గంటల నుంచి భజన కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. పంచామృతాలతో స్పటిక శివలింగానికి అభిషేకాలు, మంత్రపుష్పం అనంతరం శాస్త్రోక్తంగా సాగరహారతి కార్యక్రమాలు కనులపండువగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కులాలకు అతీతంగా అందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తడవర్తి చంద్ర, దిట్టకవి వాసుదేవాచార్యులు, సర్విశెట్టి సుబ్బరామయ్య, డాక్టర్ శబరి, గోలి మల్లికార్జున పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమికి మంత్రికి ఆహ్వానం

- గొట్టిపాటిని కలిసి పత్రికను అందజేసిన మణికేశ్వరం ఈవో, గ్రామస్థులు

అద్దంకి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం జరిగే కార్తీక పౌర్ణమి పూజలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆహ్వానించారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు, టీడీపీ నేతలు అంజయ్య, షేక్ కరిముల్లా, బడావలి, మౌలాలి తదితరులు బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి చాంబర్‌లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కార్తీక పౌర్ణమి పూజలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.



మంత్రి రవికుమార్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న మణికేశ్వరం దేవస్థానం ఈవో వాసుబాబు, గ్రామస్థులు

బ్రహ్మగుండంను పరిశీలించిన ఎస్ఐ

బల్లికురవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన గ్రామాలలో ఉన్న ప్రసిద్ధ బ్రహ్మ గుండం నీటి కొలనును ఎస్ఐ జీవీ చౌదరి బుధవారం పరిశీలించారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కార్తీక స్నానాలు చేసేందుకు భక్తులు కొణిదెన బ్రహ్మగుండానికి వస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను ఎస్ఐ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్తీక పౌర్ణమి రోజు పోలీసు సిబ్బందిని కూడా బ్రహ్మ గుండం వద్ద ఏర్పాటు చేస్తామని, భక్తులు నీటి కొలనులో స్నానాలు చేసి వెంటనే బయటకు వచ్చేలా చూడాలని నిర్వాహకులకు ఎస్ఐ సూచించారు. అలానే మహిళ భక్తులకు ప్రత్యేక వసతిని ఏర్పాటు చేయాలని ఎస్ఐ సూచించారు.

16న సర్వసభ్య సమావేశం

యద్దనపూడి, (మార్టూరు) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్‌కే మహమ్మద్ అఖీబ్ జావెద్ బుధవారం తెలిపారు. అధికారులు, గ్రామ స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. అందువలన తమ గ్రామాలలోని సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

యూటీఎఫ్ మండల నూతన కమిటీ

మార్టూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ శాఖ మండల నూతన కమిటీ ఎంపిక బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా పీ వెంకట్రావు, అధ్యక్షుడిగా యోహోషువా, సహాధ్యక్షుడిగా జాకబ్, రమ ప్రధాన కార్యదర్శిగా కె.లక్ష్మీకాంత్ కోశాధికారిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణను రామాంజనేయులు, రవిబాబులు చేపట్టారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వినయ్ కుమార్, శ్రీనివాసరావు వెంకటేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, వెంకటసుబ్బయ్య, చిట్టిబాబు, వలిఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్, ఈఈ నాగమురళీమోహన్

సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

అద్దంకి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని నోడల్ ఆఫీసర్, ఎన్ఎస్‌పీ ఈఈ నాగమురళీమోహన్ అన్నారు. ఈనెల 22న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలపై ఎలక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమంలో బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ లో జరిగింది. ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై మాస్టర్ ట్రైనీలు ప్రసాద్, అనూరాధ వివరించారు. కార్యక్రమంలో ఏఈ అనిల్ పాల్గొన్నారు.

శరవేగంగా హౌస్ జియో మ్యాపింగ్ సర్వే

పర్చూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హౌస్ జియో మ్యాపింగ్ సర్వే కార్యక్రమం గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శరవేగంగా సాగుతోంది. ప్రతి ఇంటినీ జియో మ్యాపింగ్ ద్వారా సర్వే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో సర్వే కార్యక్రమం ఊపందుకుంది. పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు, కారంచేడు, పర్చూరు, దేవరపల్లి, చెన్నుంబొట్ల అగ్రహారం, నాగులపాలెం తదితర గ్రామాల్లో జియో మ్యాపింగ్ సర్వేని బుధవారం అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ బిరుదు నాగేశ్వరరావు, సయ్యద్ కరిష్మాబేగం ఆయా గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వరి ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవాలి

బల్లికురవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు బోరు బావులు సాగర్ కాలువల కింద సాగు చేసిన వరి ధాన్యాన్ని గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా మద్దతు దరకు అమ్ముకోవాలని వ్యవసాయ శాఖ అధికారి కుమారి సూచించారు. బుధవారం మండలంలోని గుంటుపల్లి, అంబడిపూడి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఏవో పాల్గొని రైతులకు పలు సూచనలు సలహాలను అందజేశారు. వరి పంట పొట్ట దశలో ఉండగా సూడి దోమ ఆశించే ప్రమాదం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి కొనుగోలుకు మండలానికి రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రేడ్-ఏ రకం వరి క్వింటా రూ.2320 చొప్పున కొనుగోలు చేస్తారని, రైతులు వివరాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ప్రవీణ్, ఆదర్శ్, ప్రకృతి సిబ్బంది పాల్గొన్నారు.

అగ్గి తెగులుపై అప్రమత్తం

అద్దంకిటౌన్ : వరిలో అగ్గి తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితి అగ్గి తెగులు, రసం పీల్చు పురుగులకు అనుకూలంగా ఉందని, చల్లని గాలులు వీచే సమయంలో ఉధృతి ఎక్కువగా వస్తతందని ఏవో తెలిపారు. దీని నివారణ కోసం ట్రైసైక్లో జోల్ 160 గ్రాములను ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. వరి, మొక్కజొన్న, శనగ సాగు చేసిన రైతులు పంట బీమాను చేయించుకోవాలన్నారు. పొగాకుకు పత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ఏవో రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు మస్తాన్‌రావు, తూమాటి సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో వెంకట కృష్ణ

ఇంకొల్లులో పొలంపిలుస్తోంది

ఇంకొల్లు : రైతులు పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయంగా శనగ, మొక్కజొన్న, జొన్న పంటలపై మొగ్గు చూపాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని హనుమోజీపాలెంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు, మార్కెటింగ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మలుచుకోవాలని ఏవో సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి, మినుము పైర్లను పరిశీలించి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు ఏవో వివరించారు. కార్యక్రమంలో శివాని, ప్రభాకరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రైతులు వైట్ బర్లీ పొగాకు సాగుకు బదులు శనగ, మినుములు, మొక్కజొన్న, జొన్నను సాగుచేసేవిధంగా దృష్టిసారించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహనరావు అన్నారు. మండల పరిధిలోని ఉప్పుటూరు, పర్చూరులోని రైతు భరోసా కేంద్రాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రబీలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనగ, మినుము, మొక్కజొన్నకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ దృష్ట్యా ఆయా పంటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది సౌమ్య ఆశా, అరుణ, ఫిలిప్ శ్రీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, శివనాగేశ్వరరావు, పాలేరు సుబ్బయ్య, పోతురాజు పాల్గొన్నారు.

యద్దనపూడి : పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయఅధికారి ఎన్.మేరమ్మ రైతులకు సూచించారు. యద్దనపూడి మండలం తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు పత్తి పంట సాగులోని మెళకువలను వ్యవసాయ అధికారి వివరించారు.



సచివాలయం వద్ద ఎమ్మెల్యే కొండయ్యను కలిసిన చీరాల కూటమి నాయకులు

ఇంత దూరం వచ్చారు.. నేను వస్తున్నానుగా

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సచివాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే కొండయ్యను పలువురు చీరాల నియోజకవర్గ కూటమి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ఇంత దూరం వచ్చారు. నేను వస్తున్నానుగా. మన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించుకునేందుకు సంబంధీకులతో మాట్లాడుతున్నానని వారికి చెప్పారు. అయితే ఒకసారి మీతో కలసి సచివాలయం చూద్దామని నాయకులు తెలిపారు. దూరం నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించడంతో అందరూ సంతోషం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాలటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మరమ్మతుల నేపథ్యంలో నేడు పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. పేరాల, ఎల్‌బీఎస్ నగర్, మసీద్ సెంటర్, బస్టాండ్ సెంటర్, ఆంధ్రరత్న హైస్కూల్ రోడ్డు, చర్చి కాంపౌండ్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అంతరాయం కొనసాగుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

రైలు ఢీకొని రోజువారీ కూలీ మృతి


చీరాలటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబాన్ని పోషించాలని రోజువారీ కూలి పనికి వెళ్లే వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందారు. ఈఘటన బుధవారం ఉదయం చీరాల మండల పరిధిలోని విజయనగర్‌కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన తేళ్ల మార్క్ (48) రోజువారీ కూలీ. ఇతనికి భార్య విజయలక్ష్మి, పాప, బాబు ఉన్నారు. కూలి పనికి ఇంటి నుంచి బయలు దేరి వెళ్లాడు. పట్టాలు దాటుతుండగా విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్లే రైలు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ఘటనలో మార్క్ అక్కడిక్కడే మృతిచెందారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పలుచోట్ల ఎక్సైజ్ దాడులు

12 మద్యం సీసాలు స్వాధీనం

చీరాలటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల, వేటపాలెం పరిధిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈక్రమంలో చీరాల నగర్‌కు చెందిన పెరుమాని నాగేందర్‌రెడ్డి వద్ద 12 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు.

ఏపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షునిగా వెంకటేశ్వర్లు



వేటపాలెం(చీరాల), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) జిల్లా ఉపాధ్యక్షునిగా మండల పరిధిలోని నాయినిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గుత్తి వెంకటేశ్వర్లు నియమితులయ్యా రు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వెంకటేశ్వర్లును అభినందించారు. తనపై నమ్మకంతో నియమించిన బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తన విధులను సక్రమంగా, అంకిత భావంతో నిర్వహిస్తానని వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిపూర్ణప్రసాద్, వేమూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాజి శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరాలలో కుండపోత

జలమయమైన రోడ్లు



చర్చి రోడ్డులో జలమయమైన రహదారి

చీరాలటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనంతో బుధవారం సుమారు గంటపాటు కురిసిన కుండపోత వర్షానికి పట్టణంలోని పలు ప్రధాన రహదారులు, డ్రెయిన్‌లు జలమయమయ్యాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. అలాగే ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిశాయి. అలాగే ఇప్పటికే మత్స్యకారులకు సైతం వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చినగంజాం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పౌర గ్రంథాలయ శాఖ, ప్రభుత్వం ఆధ్వర్యంలో శాఖ గ్రంథాలయం చినగంజాంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు, మాదకద్రవ్యాలపై అవగాహన - పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న కవి సమ్మేళనం, సెమినారులు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థినీవిద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, క్రీడల పోటీలు, 19న మహిళలకు వివిధ కార్యక్రమాల్లో పోటీలు, రంగవల్లి, అల్లికలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన సామూహిక స్వీయ పఠనం, వారోత్సవాల ముగింపు వేడుకల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు తెలిపారు.

సెయింట్ ఆన్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ టీం ఎంపికలు



వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చాటుతున్న విద్యార్థిని

చీరాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జేఎన్‌టీయూ (కాకినాడ) ఇంటర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, యూనివర్సిటీ టీం ఎంపికలను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రారంభించారు. డాక్టర్ కొండలరావు అతిథిగా హాజరయ్యారు. పోటీల అనంతరం వర్సిటీ టీం ఎంపిక జరుగుతుందని జేఎన్‌టీయూ కాకినాడ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధి, పరిశీలకులు డాక్టర్ ఎస్.శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు, డైరెక్టర్ డాక్టర్ సి.సుబ్బారావు (అక్రిడేషన్స్), అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం నెల్లూరులోని రేబాల పట్టాభిరామిరెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభిస్తామని తెలిపారు. 20వతేదీ డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనం, గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ, బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా జరిగే వారోత్సవాలలో ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.





నిశి రాతిరిలో తెల్లని మబ్బులు

బుధవారం నిశిరాతిరిలో తెల్లని మబ్బులు నెల్లూరు నగరాన్ని కమ్మేశాయి. నల్లని ఆకాశంలో మల్లె పవ్వులాగా కదులుతున్న మేఘాలు.. భూమ్మీద విద్యుద్దీప వెలుగులు నగరవాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దీనికితోడు మబ్బులను చీల్చుకుంటూ తొంగి చూస్తున్న చందమామ చుట్టూ వలయ ఆకారం చూడముచ్చటేసింది. ఆ తర్వాత కాసేపటికే వర్షం కురవడంతో మబ్బులు కనుమరుగయ్యాయి. జాబిల్లి మబ్బుల మాటున దాక్కున్నాడు.

మచ్చలేని మాణిక్యాలు.. ముచ్చటైన అరవిందాలు



'పిల్లలు పూలతోటలో మొగ్గలు లాంటివారు. వారిని జాగ్రత్తగా చూసుకోవాలి. పిల్లలే మనకు అమూల్య సంపద' అన్నారు చాచా నెహ్రూ. 'వికసించే పుష్పాలను ఎదగనివ్వండి.' అని ప్రముఖ తత్వవేత్త సిసిరో ఉద్బోధించారు. అవును... బాలల అభిరుచిని పసిగట్టి ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. జిల్లాలో చిన్ననాటి నుంచే ఎంతోమంది బాలలు వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతూ తమ సత్తా ఏమిటో చూపుతున్నారు. క్రీడలు, నృత్యం, సంగీతం ఇలా అనేక రంగాల్లో రాణిస్తూ అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్నారు. అలాంటి పిల్లలపై గురువారం బాలల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు..

6



వైభవంగా క్షీరాబ్ది ద్వాదశి

● స్వర్ణ గరుడుడిపై రంగనాథుడు

క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బుధవారం తులసీ కల్యాణాలు వైభవంగా జరిగాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడికి తిరుమంజనం, సాయంత్రం బంగారు గరుడసేవ, పేట ఉత్సవం నిర్వహించారు. ఆ తర్వాత ఉత్తరాది మఠం వద్ద రంగనాథ, తులసీ కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఉభయకర్తలుగా వేముగుంట రాఘవేంద్ర కుటుంబం వ్యవహరించింది. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, దేవస్థాన చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

చెరువు కాదు.. స్కూలే!

వెంకటాచలం మండలం అనికేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణం వర్షపునీటితో నిండిపోయింది. వర్షం కురిసిన ప్రతిసారి తమ బడి చెరువును తలపిస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పనుల్లో భాగంగా పాఠశాలల్లో మరమ్మతు పనులు జరిగాయి. కానీ చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఇబ్బందులు తప్పడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

- వెంకటాచలం (ఆంధ్రజ్యోతి)



దంచికొట్టిన వాన

● జిల్లాలో సగటు వర్షపాతం 54.3 మిమీ

● నేడూ, రేపు వర్షాలే..

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం ఉదయం జిల్లాలో వర్షం దంచి కొట్టింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, రహదారులన్నీ దాదాదాపు చెరువులను తలపించాయి. నెల్లూరు నగరంతో పాటు కావలి, బోగోలు, పొదలకూరు, వెంకటాచలం, ఏఎస్‌పేట, ఉదయగిరి, అల్లూరు, మనుబోలు తదితర మండలాల్లో భారీ వర్షం పడింది. నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఉదయం కురిసిన వర్షానికి సైడ్ కాలువల్లో నీరు ఇళ్లలోకి వచ్చి చేరింది. ఆదిత్యనగర్ ప్రాంతంలో రోడ్ల మీద నీరు నిలిచింది. జనార్దన్‌రెడ్డి కాలనీలో మోకాలిలోతు నీరు నిలిచింది. రైల్వే అండర్ బ్రిడ్జీలలో చేరిన నీటిని కార్పొరేషన్ అధికారులు తోడేశారు. పలు ప్రాంతాలలో సైడ్ కాలువల్లో చెత్త పేరుకుని ఉండటంతో మురుగు ముందుకు కదలలేదు. దీనికి తోడు వర్షపు నీరు తోడు కావటంతో మురుగంతా రోడ్డులమీదుకు, ఇళ్లముందు చేరిపోయాయి. చివరకు బుధవారం మధ్యాహ్నం పొడివాతావరణం నెలకొంది. అయితే, రాత్రి నగరంలో మళ్లీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీన పడినా గురు, శుక్రవారాల్లోనూ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.



కావలి : చెరువులా ఉన్న తుమ్మలపెంట రోడ్డులోని లేఅవుట్లు

● సగటు వర్షపాతం 54.3 మి.మీ

జిల్లాలో బుధవారం సగటు వర్షపాతం 54.3 మి.మీగా నమోదైంది. అత్యధికంగా బోగోలులో 142 మి.మీ, అత్యల్పంగా వరికుంటపాడులో 8.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. పొదలకూరు 122.2, అల్లూరు 114.2, మనుబోలు 111.4, దగదర్తి 106.2, వెంకటాచలం 84.2, బుచ్చి 84.2, టీపీ గూడూరు 79.4, ముత్తుకూరు 72.4, కావలి, కలువాయి 66.2, గుడ్లూరు 66, జలదంకి 64.6, నెల్లూరు అర్బన్ 63.2, ఉలవపాడు 60.6, నెల్లూరు రూరల్ 59.6, కొడవలూరు 58.6, రాపూరు 56.6, కోవూరు 53.6, కొండాపురం 52, సైదాపురం 51.2, విడవలూరు 48, ఇందుకూరుపేట 45.8, లింగసముద్రం 43.6, కందుకూరు 41.2, వింజమూరు 39.2, ఏఎస్‌పేట 37.5, వలేటివారి పాళెం 32.6, కలువాయి 25.4, చేజర్ల 23.8, ఆత్మకూరు 21.4, సీతారామ పురం 13, కలిగిరి 12.8, ఉదయగిరి 12.8, దుత్తలూరు 11.2, అనంతసాగరం 10.4, మర్రిపాడు 8.4 మి.మీ వర్షం కురిసింది.

● మునిగిన కావలి

కావలి (ఆంధ్రజ్యోతి) : ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి కావలి పట్టణం జలమయం అయ్యింది. ఉదయానికి 6 సెం.మీ, మధ్యాహ్నానికి మరో 6 సెం.మీ వర్షపాతం నమోదయ్యింది. భారీ వర్షం కురవడంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ నీటిలో చిక్కుకున్నాయి. ట్రంకు రోడ్డు సైతం వాగును తలపిస్తూ నీరు పారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మునునూరు ఇందిరమ్మ కాలనీలో ఇంజనీరింగ్ విద్యార్థులు సెమ్ పరీక్షకు ట్రాక్టర్‌లో వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తుమ్మలపెంట రోడ్డుకు ఇరువైపులా వరవ కాలువలు ఆక్రమణకు గురికావటంతో నీటిపారుదల కష్టంగా మారింది. ఇక బాలక్రిష్టారెడ్డి నగర్, మునునూరు ఇందిరమ్మ కాలనీ ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి.



నెల్లూరు : సండేమార్కెట్‌లో నిలబడిన నీరు

ఎలా తప్పించుకుందాం!

'హౌసింగ్'లో విజిలెన్స్ గుబులు

ఇప్పటికే ప్రాథమిక విచారణ పూర్తి..

రూ.120 కోట్ల అవినీతి జరిగిందని నివేదిక

300 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు

తప్పించుకునేందుకు అధికారుల విశ్వప్రయత్నం

పేదల ఇళ్ల మాటున జరిగిన భారీ అవినీతి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. గత ప్రభుత్వంలో అడ్డూ అదుపు లేకుండా గృహ నిర్మాణ శాఖలో అక్రమాలు జరిగినా పట్టించుకున్న నాథుడు లేడు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అక్రమాల పుట్ట బద్ధలవుతోంది. పేదల ఇళ్ల నిర్మాణాలలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్సు విచారణకు ఆదేశించగా, ప్రాథమిక విచారణలోనే అనేక అవకతవకలు వెలుగుచూశాయి. నాడు ఈ అక్రమాల వెనుక కీలకంగా వ్యవహరించిన పలువురు హౌసింగ్ అధికారుల మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది. పూర్తిస్థాయిలో విజిలెన్సు విచారణ జరిగితే ఏఈల దగ్గర నుంచి పీడీల వరకు అనేక మంది వ్యవహారాలు బట్టబయలయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని గమనించిన పలువురు అధికారులు ఎలాగైనా విజిలెన్సు విచారణ నుంచి తప్పించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. సచివాలయాల్లో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లే బాధ్యులని చూపించే కుట్రలు జరుగుతున్నాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ముందుపెట్టి, హౌసింగ్ అధికారులు తప్పించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

నెల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :పేదల ఇళ్ల నిర్మాణాలలో జరిగిన అవకతవకలపై వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్సు అధికారులు విచారణ మొదలుపెట్టారు. ప్రాథమికంగా ఇప్పటివరకు కట్టిన ఇళ్లు, చేసిన పేమెంట్ వివరాలను సరిపోల్చారు. ఆ క్రమంలోనే దాదాపు రూ.120 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు నిగ్గుతేల్చి, సుమారు 300 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లను బాధ్యులను చేస్తూ నోటీసులను

- మిగతా 6లో..



2 గంటలు.. 54 ప్రశ్నలు

● వైసీపీ నేత కాకాణిని విచారించిన పోలీసులు

మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీస్ కేసులు వీడటం లేదు. సీఎం చంద్రబాబు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఈయన కుమారుడు రాజగోపాల్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వచ్చాయి. దీనిపై టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు లకు సంబంధించి ఇటీవల వెంకటాచలంలో పోలీసుల ఎదుట విచారణకు హాజరైన కాకాణి బుధవారం ముత్తుకూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. సీఐ రవినాయక్ రెండు గంటలపాటు 54 ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టారు.

6



మఱ్రి ఆకుపై చాచా నెహ్రూ

పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామానికి చెందిన పచ్చ పెంచలయ్య తన సృజనను మరోసారి వెలికితీశారు. భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ (చాచా నెహ్రూ) జయంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని మఱ్రిఆకుపై అద్భుతంగా చిత్రించారు. భావిభారత పౌరులైన చిన్నారులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)



ఇలాగైతే ప్రమాదాలు జరగవా!?

డ్రైవర్‌తోపాటు ఐదుగురు ప్రయాణించాల్సిన ఆటో అది. కానీ ఇదిలో ఇలా 20 మంది విద్యార్థులను ఎక్కించేకుని రయ్..మని దూసుకెళ్లిపోయాడు ఓ ఆటోవాలా. కావలిలోని వైకుంఠపురంలో ఆ దృశ్యాన్ని చూసిన స్థానికులు పిల్లల కు ఏమైనా జరిగితే ఎవరు జవాబుదారీ అంటూ ఆగ్ర హం వ్యక్తం చేశారు. పట్టణంలో దాదాపు ఇలా కిక్కిరిసిన ఆటోలే కనిపిస్తున్నాయని పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఏం చేస్తున్నారని దుమ్మెత్తి పోస్తున్నారు.

- కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి)

వేదగిరి క్షేత్రంలో 'పవిత్ర' సమర్పణ

వేదగిరి క్షేత్రంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో బుధవారం పవిత్ర సమర్పణ కార్యక్రమం జరిగింది. ముందుగా తిరుమంజనం, విశేష పూజలు, హోమాలు జరిగాయి. అనంతరం పవిత్రాలను ఆలయ అర్చక బృందం వేద మంత్రోచ్చారణ, మంగళవాద్యాలతో లక్ష్మీనరసింహుడి సన్నిధికి తరలించారు. ఈ ఉత్సవాలు వైఖానస ఆగమ విద్వాన్ డాక్టర్ పీ సత్యనారాయణచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు నేతృత్వంలో జరుగుతుండగా ఈవో గోపీ పర్యవేక్షించారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



నేడు బాలల దినోత్సవం



పుట్టింది పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అయినా చిన్నతనం నుంచే లక్ష్యం, ఉన్నతాశయాలతో ఎంతో మంది బాల, బాలికలు ఉన్నతంగా రాణిస్తున్నారు. సమాజంలో మార్పులకు అనుగుణంగా తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహిస్తుండటంతో తమకున్న ప్రతిభా పాటవాలతో నచ్చిన రంగాల్లో సత్తా చాటుతున్నారు. ఈ బాలలను ఆదర్శంగా తీసుకుని మిగిలిన వారికి కూడా అమ్మానాన్నలే గురువులు, స్నేహితులుగా మారి రేపటి భారతానికి బంగారుబాటలు వేయించాలి. చాచా నెహ్రూ కలలు కన్న అందమైన, ఆనందకరమైన జీవితాన్ని వారికి అందించాలి. ఈ బాలల దినోత్సవం ఇందుకు శ్రీకారం కావాలి. మన చిన్నారుల జీవితాల్లో సరికొత్త ఉషోదయం రావాలి.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

మచ్చలేని మాణిక్యాలు.. ముచ్చటైన అరవిందాలు

క్రీడారంగంలో మెరికలు.. నృత్యంలో మయూరీలు • అబ్బురపరిచే ప్రదర్శనలతో ఎన్నెన్నో పతకాలు

బ్యాడ్మింటన్‌లో అనీష్ సత్తా


అనీష్‌డానీ

నెల్లూరుకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అనీష్‌డానీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతున్నాడు. పోలీస్‌శాఖలో పనిచేస్తున్న తండ్రి రమేష్, తల్లి సుజీవని రాణి తమ కుమారుడు అనీష్‌డానీలోని క్రీడా ప్రతిభను గుర్తించి ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్‌లో 2017లో బ్యాడ్మింటన్‌లో శిక్షణకు చేర్పించారు. అప్పటి నుంచి క్రమశిక్షణతో శిక్షణ పొందిన అనీష్ 2018లో తొలిసారిగా జిల్లాస్థాయిలో అండర్-13 విభాగంలో ప్రథమ, డబుల్స్‌లో 2వ స్థానం సాధించాడు. అదే ఏడాది అండర్-15 విభాగం సింగిల్స్‌లో ప్రథమం, డబుల్స్‌లో ద్వితీయస్థానంతో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసింది. అదే ఏడాది ఒంగోలులో జరిగిన రాష్ట్ర పోటీల్లో అండర్-13 సింగిల్స్‌లో ప్రథమం, శ్రీకాకుళంలో జరిగిన అండర్-17లో ద్వితీయస్థానం సాధించాడు. 2019లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికై 2022లో పంచకుల్లాలో జరిగిన అండర్-15 సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు, అండర్-17 సింగిల్స్‌లో ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. అనంతరం గోపీచంద్ అకాడమీలో జరిగిన జాతీయ పోటీల్లో అండర్-15 సింగిల్స్‌లో తృతీయస్థానం, జ్వాలా గుప్తా అకాడమీలో జరిగిన అండర్-15 సింగిల్స్‌లో విజేతగా నిలిచి అంతర్జాతీయ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. 2022లో థాయ్‌లాండ్‌లో జరిగిన ఏషియా అండర్-15 జూనియర్ ఛాంపియన్ షిప్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించి సిల్వర్‌మెడల్ సాధించారు. నాటినుంచి నేటివరకు అన్ని పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నానని, ఒలంపిక్‌లో పతకం సాధించడే తన లక్ష్యమని అనీష్ తెలిపాడు.

జంప్‌రోప్‌లో 'స్వర్ణ' సుష్మి



నిరుపేద కుటుంబానికి చెందిన కలిగిరి మండలం పడమటిగుడ్డదోనె గ్రామానికి చెందిన చిట్టేటి సుష్మి అకుంఠిత దీక్ష, పట్టుదలతో అంతర్జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. తల్లిదండ్రులు సుమలత, శ్రీనివాసులు కుమార్తెను చదివించాలన్న పట్టుదలతో కలిగిరి కేజీబీవీలో చేర్పించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.స్పందన సుష్మిలోని ప్రతిభను గుర్తించి జంప్ రోప్ క్రీడలో ప్రత్యేక తర్ఫీదు అందించారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణిస్తూ తొలిసారిగా 2018-19లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారుపతకం సాధించింది. దీంతో సుష్మిని జాతీయ పోటీలకు ఎంపిక చేయడంతో 2019-20లో ఆగ్రాలో జరిగిన పోటీల్లో వెండిపతకం కైవసం చేసుకుంది. 2020-21లో నంద్యాలలో జరిగిన రాష్ట్రపోటీల్లో బంగారు పతకం, అదే ఏడాది మహారాష్ట్రలో జరిగిన జాతీయ పోటీల్లో రెండు బంగారు పతకాలు సొంతం చేసుకుంది. అదే ఏడాది తెనాలిలో రాష్ట్ర పోటీల్లో బంగారు పతకం, అక్కడే జరిగిన జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించి అందరి ప్రశంసలందుకుంది. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన సుష్మి 2022 జులైలో థాయ్‌లాండ్‌లో జరిగిన జంప్‌రోప్ అండర్-15 చాంపియన్‌షిప్‌లో వెండిపతకం సాధించి దేశ ప్రతిష్టను ఇనుమడింప చేసింది. ఇదే స్ఫూర్తితో ముందు మరింత ఉత్తమంగా రాణించి పతకాలు సాధించడమే ధ్యేయంగా సాధన చేస్తున్నానని సుష్మి తెలిపారు.

శాస్త్రీయ నృత్యంలో దిట్ట శరణ్య

ఆత్మకూరు : పట్టణంలోని మల్లినేని గోపి, వినోద దంపతుల కుమార్తె శరణ్య 8వ తరగతి చదువుతూనే శాస్త్రీయ సంగీతంలో రాణిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. సంగీత నృత్య విద్యాలయంలో క్రమం తప్పకుండా నృత్యసాధన చేసి పలు ప్రాంతాల్లో నృత్య పోటీలు, ప్రదర్శనల్లో పాల్గొని ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎన్నో బహుమతులను అందుకుంది.

కాలు కదిపితే నాట్య మయూరే..



ఆత్మకూరు : పట్టణంలోని చంద్రశేఖర్, శాంతిల కుమార్తె లక్ష్య. పదవ తరగతి చదువుతున్న లక్ష్య కూచిపూడి నాట్యమంటే మహా ఇష్టం. ఇది గమనించిన తల్లిదండ్రులు లక్ష్యను ప్రోత్సహించి, సంగీత నృత్య విద్యాలయంలో చేర్పించారు. చదువుతోపాటు నృత్యంలో రాణిస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు హైదరాబాద్, శ్రీశైలం తదితర పట్టణాల్లో సైతం నృత్య ప్రదర్శనలు ఇచ్చి అబ్బురపరిచింది. హైదరాబాద్‌లో జరిగిన నృత్యప్రదర్శలో తన సత్తా చాటి నాట్య కిరణ అవార్డును అందుకొని ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

నాట్య కిరణాలు ఈ అక్కాచెల్లెళ్లు


దీపిక


గీతిక

ఆత్మకూరు : చెర్లోయడవల్లి గ్రామానికి చెందిన కల్యాణ్‌కుమార్, రాధికల కుమార్తెలు దీపిక, గీతిక. దీపిక వయసు ఎనిమిదేళ్లు. చెర్లోయడవల్లి ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతోంది. ఇక గీతిక వయసు 12 ఏళ్లు. చెల్లెలు చదివే పాఠశాలలోనే 7వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించి, పలు ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలు ఇవ్వడంతోపాటు పలు పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుకున్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ భారతి చేతుల మీదుగా నాట్య కిరణ అవార్డులను అందుకున్నారు.

కుస్తీ పోటీల్లో అర్చన అదుర్స్



ఆత్మకూరు : మండలంలోని బట్టేపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అర్చన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించింది. పెంచలయ్య, ఆదిలక్ష్మీ దంపతుల కుమార్తె అర్చనకు ఆటలంటే ఎంతో ఇష్టం. వ్యాయామ ఉపాధ్యాయుడు కె వెంకటకృష్ణయ్య తన సొంత ఖర్చులతో కుస్తీ పోటీలకు శిక్షణ ఇచ్చాడు. గత ఏడాది విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు చిత్తూరు జిల్లా యాదమర్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో అండర్-17, క్యాటగిరి 69 కేజీ విభాగంలో అర్చన తన సత్తా చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. జాతీయస్థాయి పోటీలకు ఎన్నికైంది. వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించేందుకు సన్నద్ధమవుతోంది.

పంచ్ కొడితే పతకమే!

కోవూరు : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎన్ హర్షిణి బాక్సింగ్‌లో సత్తాచాటుతోంది. ఓ వైపు చదువులో ఉన్నతంగా రాణిస్తూనే రాష్ట్రస్థాయి పోటీల్లో ఇప్పటికే ఐదు కాంస్య పతకాలు, ఓ రజిత పత కాన్ని కైవసం చేసుకుంది. రాజ మండ్రి, విజయవాడ, విజయనగరం తదితర ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తన ప్రతిభను చాటి ప్రముఖులతో శభాష్ అనిపించుకుంది. బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీ ల్లోనూ రెండు కాంస్య పతకాలు సాధిం చింది. తిరుపతిలో జరిగిన సీఎం కప్ పోటీలో పాల్గొని రజితపతకం అందుకుంది.



ఎత్తుకు పైఎత్తులు వేస్తూ..



బుచ్చిరెడ్డిపాళెం : ఓ సామాన్య రైతు కుటుంబానికి చెందిన గొట్టేటి ప్రసాద్‌రెడ్డి, సుకన్యల కుమార్తె హిమతేజశ్విని చదరంగంలో తన ప్రతిభను చాటుతూ అనేక పతకాలు కైవసం చేసుకుంది. 9వ తరగతి చదువుతున్న హిమతేజస్విని ఇంటర్నేషనల్ మాస్టర్ రవితేజ వద్ద శిక్షణ పొందుతోంది. 2022లో అండర్-19 రాష్ట్ర బాలికల చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. గత నెలలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల విభాగంలో మొదటి స్థానం, ఇటీవల మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో జరిగిన జాతీయస్థాయిలో పోటీలలో ప్రతిభను కనబరిచి, ప్రముఖుల అభినందనలు అందుకుంది.

'నంది' విజేత..



కావలికి చెందిన కొండా మహేంద్ర, కవిత దంపతుల కుమార్తె చైత్రలక్ష్మి 6వ తరగతి చదువుతోంది. నాట్యాచార్యులు ముత్తంశెట్టి ఉమామహేశ్వరరావు శిక్షణ పొందిన ఈ బాలిక జిల్లాలోనే రాష్ట్రస్థాయిలో అనేక ప్రదర్శనలు ఇచ్చింది. హైదరాబాదులోని రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో చైత్రలక్ష్మి కూచిపూడిలో ప్రతిభ కనబరిచి నంది అవార్డు అందుకుంది. అలాగే తిరుపతిలో శ్రీకృష్ణదేవర ట్రస్ట్ నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లోనూ ప్రథమ బహుమతి అందుకుంది.

- కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి)

ఎలా తప్పించుకుందాం!

(5వ పేజీ తరువాయి)

జారీ చేశారు. ఇప్పుడిప్పుడే వారు కూడా వివరణ ఇస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తికా గానే క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది. ఇది జరిగితే హౌసింగ్ శాఖలోని పలువురు అధికారుల బండారం బయటపడుతుంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరగకుండా ఆపుకునేందుకు రాష్ట్రస్థాయిలో ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

• ఇటీవల రహస్య సమావేశం

నెల్లూరులో ఇటీవల హౌసింగ్ అధికారులు రహస్య సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ సమావేశానికి గత ప్రభుత్వంలో పనిచేసి పదవీ విరమణ చేసిన పలువురు అధికారులతోపాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కూడా పాల్గొన్నారు. విజిలెన్సు విచారణలో అక్రమాలు బయటపడకుండా ఏం చేయాలన్నదానిపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పెద్దసంఖ్యలో ఉంటారు కాబట్టి వారిని ముందుపెట్టి, కథ నడిపిస్తే తప్పించుకోవచ్చని కొందరు సూచించినట్లు ప్రచారం నడుస్తోంది. ఆ క్రమంలోనే ఇటీవల భారీ సంఖ్యలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను తీసుకుని ఓ ఎమ్మెల్యే వద్దకు వెళ్లారు. హౌసింగ్‌లో జరిగిన అక్రమాలపై ఆ ఎమ్మెల్యే ప్రశ్నించగా ఒకరి వద్ద సమాధానం లేకుండా పోయింది. అలానే వీరంతా కలిసి విజయవాడలో ఓ మంత్రిని కలిసినట్లు తెలుస్తోంది. విచారణ పేరుతో విజిలెన్సు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, విజిలెన్సు విచారణను ఆపాలని కోరినట్లు హౌసింగ్ శాఖలో చర్చించుకుంటున్నారు.

• అనేకమందిపై ఆరోపణలు

పేదల ఇళ్ల నిర్మాణ పథకం గృహ నిర్మాణ శాఖలోని కొందరు అధికారులకు కాసులు కురిపించింది అనేది బహిరంగ రహస్యం. వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలు మొదలైనప్పటినుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆప్షన్-3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ నిర్మాణ బాధ్యతలను ఒక పద్ధతి అంటూ లేకుండా, ఎవరికంటే వారికి కాంట్రాక్టులు అప్పగించారు. ఈ క్రమంలోనే భారీ అవినీతి చోటుచేసుకుంది. కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మించకపోయినా బిల్లులు చెల్లించారు. ఇసుక, స్టీల్, సిమెంట్ వంటి మెటీరియల్‌ను పక్కదారి పట్టించారు. నిర్మించిన ఇళ్లు కూడా నాసిరకంగానే ఉన్నాయి. ఇళ్ల నాణ్యతపై విచారణ జరిపితే మరిన్ని అవినీతి అధికారుల బాగోతాలు వెలుగులోకి వస్తాయి. గతంలో పనిచేసిన కొందరు అధికారులు ఈ అక్రమాల వెనుక కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై అప్పట్లోనే హౌసింగ్ విజిలెన్సు విభాగానికి ఫిర్యాదులు అందగా ఆ విభాగం విచారణ కూడా చేపట్టింది. జిల్లాలో అనేక అవకతవకలు జరిగినట్లు నిర్ధారించి నివేదికలు సమర్పించాయి. కానీ నాడు ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదు. ఆ నివేదికలను ఇప్పుడు బయటకుతీస్తే చాలా విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అవసరానికి మించి అందుబాటులో ఎరువులు

• డీఏవో సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ డివిజన్ పరిధిలో అన్ని రకాల ఎరువులు అవసరానికి మించి అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరు, వలేటివారిపాళెం, గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాల పరిధిలో మొత్తం 136 హెక్టార్లలో వరి, 464 హెక్టార్లలో మినుము, 251 హెక్టార్లలో మిరప, 393 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారని తెలిపారు. వీటికి సంబంధించి యూరియా 578 మెట్రిక్ టన్నులు, డీఏపీ 710, ఎంవోపీ 55, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 362 టన్నులు చొప్పున అవసరానికి మించి అందుబాటులో ఉన్నాయని వివరించారు. అన్ని ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని, రైతులకు రశీదు ఇవ్వాలని, అమ్మ కాల ధరలు, నిల్వ వివరాలు నోటీసు బోర్డులో చూపాలని విక్రయదారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. లైసెన్సు తీసుకున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులు తెచ్చుకోవాలని సూచించారు.


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె

• వెంటనే సమస్యలు పరిష్కరించాలి : డీఆర్వోకు వినతి

నెల్లూరు (వైద్యం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా 108 అంబులెన్స్ వాహనాల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళతామని 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్‌కు వినతి పత్రం అందించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలిపామన్నారు. అయితే అరబిందో సంస్థ యాజమాన్యం, అధికారులు సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో 108 సర్వీసుల బాధ్యతను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 108 ఉద్యోగులకు వైద్య ఆరోగ్యశాఖలోని ఇతర ఖాళీల్లో అర్హతను బట్టి వెయిటేజీ ఇవ్వాలని, పైలేట్లకు ఆర్టీసీలో డ్రైవర్లుగా వెయిటేజీ ఇచ్చి నియామకాలు చేప ట్టాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగులను వారి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నరసింహారావు, కోశా ధికారి శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ మహేష్ పాల్గొన్నారు.

ఇదేం 'న్యాయ'ం!?

• 'లా' పరీక్షల్లో గందరగోళం

• విద్యార్థులు, ఇన్విజిలేటర్ల మధ్య వాగ్వాదం

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ పీజీ కళాశాలలో జరుగుతున్న న్యాయ విద్యార్థుల 3, 5 సంవత్సరాల సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం గందరగోళం నెలకొంది. ఇష్టానుసారంగా పరీక్షలు నిర్వహిస్తున్నారంటూ విద్యార్థులు, ఇన్విజిలేటర్ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకుంది. నగదు ఇవ్వలేదన్న అక్కసుతో తమను డీబార్ చేసేందుకు స్క్వాడ్ సభ్యులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. కొంతమంది వద్ద నగదు తీసుకుని ఇష్టానుసారంగా పరీక్షలు రాసేందుకు అనుమతి ఇచ్చిన ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ సభ్యులు తమను మాత్రం వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడటంతో పాటు విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


టీడీపీ నాయకులకు సర్దిచెబుతున్న పోలీసులు

2 గంటలు.. 54 ప్రశ్నలు

• వైసీపీ నేత కాకాణిని విచారించిన ముత్తుకూరు పోలీసులు

• సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టారని అభియోగం

• వైసీపీ బలప్రదర్శనను అడ్డుకున్న టీడీపీ

ముత్తుకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు రాజగోపాల్‌రెడ్డిలపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలతో పోస్టులు పెట్టారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున యాదవ్ ఫిర్యాదు చేసిన కేసులో బుధవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు చేద్దామన్న హడావుడికి టీడీపీ నాయకులు చెక్ పెట్టారు. పోలీసుల విచారణకు పిలిస్తే నియోజకవర్గ నాయకులను వెంటబెట్టుకుని కాకాణి ర్యాలీగా రావడానికి ప్రయత్నించారు. దీనిపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముత్తుకూరు ప్రధాన కూడలిలో టీడీపీ నాయకులు సమావేశమై స్టేషన్‌కి కాకాణి మాత్రమే రావాలని వైసీపీ నాయకులు వస్తామంటే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. కాకాణితోపాటు వచ్చిన వైసీపీ నాయకులను ముత్తుకూరు శివార్లలోనే పోలీసులు ఆపేశారు. కాకాణి ఒక్కరే స్టేషన్‌కు రావాలని కృష్ణపట్నం సీఐ రవినాయక్ స్పష్టం చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి, విచారణకు సహకరించాలని కోరారు. చివరకు మధ్యాహ్నం 12గంటలకు కాకాణి లాయర్‌తో కలిసి ముత్తుకూరు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. 2గంటలపాటు సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో 54 ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. విచారణ అనంతరం కాకాణి మాట్లాడుతూ తనపై అక్రమ కేసులు బనాయించారని కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నీలం మల్లికార్జున యాదవ్, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ఈపూరు మునిరెడ్డి, కోదండయ్య, శ్రీధర్‌రెడ్డి, శివకృష్ణ, శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు జనార్ధన్, ఈశ్వరయ్య, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బాధ్యతల స్వీకరణ

అల్లూరు, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారిగా వెంకటేశ్వర్లు బుధ వారం బాధ్యతలు స్వీకరించిచారు. రబీ సీజన్‌లో వ్యవసాయ అవసరాలకు సంబం ధించి ఏ సమయంలో అయినా వచ్చి కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

నారుమడుల పరిశీలన

బిట్రగుంట, నవంబరు 13. (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిని విజయలక్ష్మీ విశ్వనాథరావుపేట, తాళ్లూరు, కొత్తూరులో బుధవారం రైతులు పోసిన పలు నారుమడులను పరిశీలించారు. కొత్తూరు గ్రామ శివారులోని వరినారుమడిలో నిల్వ ఉన్న వర్షపు నీరును రైతులతో తొలింప జేశారు. తాళ్లూరులో పొల్లాలకు పైనుంచి వర్షపు నీరు వస్తుండటంతో నారుమడికి ఇరువైపుల కాలువలు తీసుకోవాలని సూ చించారు. రైతుల అవసరార్థం యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్ర మంలో వ్యవసాయ సహాయకులు గాంధీ, వర్షిత, రైతులు తదితరులు ఉన్నారు.

చెత్తా,చెదారం తొలగింపు



డ్రైన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కావలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలతో స్థానిక రామమూర్తి పేట, ఏఎం బేకరి ప్రాంతం, మందాటిచెరువు సమీపంలోని ప్రధాన డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకపోయి వర్షపు నీరు పారుదలకు ఆటంకం కలిగింది. ఈ విషయం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసు కెళ్లగా ఆయన కార్మికులను తీసుకొచ్చి దగ్గరుండి చెత్తను తొలగింపజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలో తిరుగుతున్న బస్సుల సౌకర్యాలు, లా జిస్టిక్ సేవలపై ప్రజలు, ప్రయాణికుల నుంచి తగు సూచనలు, సలహాల కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11నుంచి 12గంటల్లోపు 9959225095కు ఫోన్ చేసి సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు తగిన సూచనలు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలలకు పరిశుభ్రత, పచ్చదనం ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థుల అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించడంతోపాటు మధ్యాహ్న భోజనాన్ని రుచిని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట సాగు చేసి నష్టపోకుండా రైతులు ప్రత్యామ్నాయ పంటలైన శనగ, జొన్న, మినుము తదితర పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎన్.వెంకటసుబ్బారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని భైరవరం రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయన్నారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సుష్మిత, వీఏఏ దినేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే భూ సమస్యలపై గ్రామసభ

సీతారామపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పండ్రంగిలో గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేలో వచ్చిన భూసమస్యలను పరిష్కరించడం కోసం బుధవారం తహసీల్దారు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, కార్యదర్శి రామ్‌నాథరెడ్డి, వీఆర్వో మనోహర్, సర్వేయర్ సంగీత పాల్గొన్నారు.



డీఆర్ఎం దృష్టికి రైల్వే సమస్యలు

కావలి, నవంబరు 13: నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి బుధవారం విజయవాడలో రైల్వే డివిజనల్ మేనేజరు (డీఆర్ఎం) నరేంద్ర పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందచేశారు. ఫ్లైఓవర్, అండర్‌పాస్ వంతెనల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని తెలి పారు.



రైల్వే డీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

మారుతున్న పల్లె రూపురేఖలు

- అమలు అవుతున్న ఎన్నికల హామీలు
- గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

వలేటివారిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పంచా యతీల అభివృద్ధికి నిధులు రాకపోవడంతో సర్పంచులు కూడా అప్పట్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే సిమెంటు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో 25సిమెంటు రోడ్డు పనులకు గానూ రూ.3కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం అంకభూపాలపురం, బడేవారిపాలెం, నలదలపూరు, కళ్లవళ్ల గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. మిగిలిన గ్రామాల్లో ప్రారంభం కానున్నాయి. సిమెంటు రోడ్ల పనులు చేస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● పనులు వేగంగా పూర్తి చేస్తాం

- శ్రీనివాసులు, పీఆర్ ఇన్‌చార్జి ఏఈఈ వలేటివారిపాలెం

మండలంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఉపాధిహామీ పథకంతో నిధులు మంజూర య్యాయి. ఇప్పటికే అంకభూపాలపురం, బడేవారిపాలెం, నలదలపూరు, కళవళ్ల గ్రామాల్లో ఈ సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయి. మిగిలిన గ్రామాల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

● ఇబ్బందులు పడ్డాం

ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలకు నిధులు మంజూరు కాక పోవడంతో మౌలిక వసతులు కల్పించలేదు. నేడు కూటమి ప్రభుత్వం అధికారలోకి వచ్చిన వందరోజుల్లోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ప్రజలు ఈ పనులతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రగడ శ్రీనివాసులు



అంకభూపాలపురంలో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు

● సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు



కొన్నేళ్ల నుంచి మా వీధిలో సీసీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడేవాళ్లం. వానొస్తే మట్టిరోడ్డంతా బురదమయంగా మారేది. వానాకాలమంతా తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం మా వీధిలో సిమెంటు రోడ్డు వేస్తున్నారు. మా కష్టాలు తీరుతాయి.

- పి.మోహన్‌కుమార్ అంకభూపాలపురం

● హామీలు నెరవేస్తున్నారు



టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే గ్రామాల్లో సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ లను నెరవేర్చుతున్నారు. ఈ మేరకు రోడ్డు పనులు ప్రారంభించడం అభినం దనీయం.

- బక్కమంతులు మాల్యాద్రి

పదివేల ఎకరాలకు సాగునీరందిస్తాం

● వినయ్ కుమార్, ఇరిగేషన్ ఏఈ, సంగం సెక్షన్



సంగం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రారంభమైయ్యే రబీ సీజన్‌కు దువ్వూరు కాలువ, డీబీ చానల్ పరిధిలో సుమారు పది వేల ఐదు వందల ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తామని సంగం సెక్షన్ ఇరిగేషన్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ

? ఐదేళ్లుగా పూడిక పనులు చేయలేదు.

! ఏడు కిల్లోమీటర్ల పొడవున్న దువ్వూరు కాలువ పూడిక పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేశాం. డీబీ చానల్‌లో రెండు యంత్రాలతో పనులు చేపట్టాం. అవసరమైన కాలువల్లో మూడు రోజుల్లో పనులు చేస్తాం.

? ఇరిగేషన్ పనులకు ఎన్ని నిధులు మంజూరయ్యాయి.

! రూ.42లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటితో మర్రిపాడు, చెన్నవరపాడు, తలుపూరుపాడు చెరువు కట్టల పటిష్టత, తూముల రిపేరు చేయిస్తాం.

భారీ వర్షంతో పొంగిన వాగులు, వంకలు



కావలి: వాగును తలపిస్తున్న తుమ్మలపెంట రోడ్డు



ఉదయగిరిలో రహదారులపై ప్రవహిస్తున్న నీరు

కావలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిసిన భారీ వర్షంతో పట్టణమంతా జలమయం అయ్యింది. ట్రంకురోడ్డు వాగును తలపిస్తూ నీరు పారటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. స్థానిక ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని కొందరు విట్స్ ఇంజి నీరింగ్ కళాశాల విద్యార్థులు సెమ్ పరీక్ష రాసేందుకు తల్లిదండ్రులు ట్రాక్టర్‌లో తీసుకువెళ్లారు. తుమ్మలపెంట రోడ్డుకు ఇరువైపులా ఉన్న వరవ కాలువలు ఆక్రమణలకు గురవడంతో రోడ్డువాగును తలపించింది. పక్కనే ఉన్న లేలవుట్లు చెరువులను తలపించాయి. బాలక్రిష్ణారెడ్డినగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీ జలయమం అయ్యాయి.

పొంగి పారుతున్న వాగులు

బిట్రగుంట, నవంబరు 13: మండలంలో కురిసిన వర్షాలకు కాలువలు, వాగులు పొంగడంతో చెరువుల్లో జలకళ సంతరించుకుంది. 5వేల ఎకరాలకు సరిపడే 250 ఎకరాల్లో రైతులు నార్లు పోసి ఉన్నారని మండల వ్యవసాయ అధికారిని విజయలక్ష్మీ తెలిపారు. సాగునీరు సంమృద్ధిగా ఉండటంతో రైతులు విత్తనాలు చలేందుకు సిద్ధం అవుతున్నారు. మండలకేంద్రంలోని తిప్పకాలనీలోని ఇళ్లలోకి చేరిన వర్షపు నీటిని తొలగించేందుకు ఎంపీడీవో సుబ్రమణ్యం, ఏవో గోవిందరావులు యంత్రాల సహాయంతో నీటిని తొలగించారు. వారివెం టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, కార్యదర్శి జహీర్, స్థానిక పార్టీ నేతలు మనోహర్, క్రాంతి, యు.రవి, ఎహిజ్కెల్, ఆవుల బాబు ఉన్నారు. అలాగు బోగోలు ఇన్‌చార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు బోగోలు చెరువును పరిశీలించారు. అక్కరాజువారి కండ్రి చెరువు పల్లపు కలుజు పారుతుండం వలన బోగోలు చెరువుకు సమృద్ధిగా నీరు చేరే అవకాశం ఉందన్నారు.

36.2 మి.మీ వర్షపాతం నమోదు

ఉదయగిరి రూరల్, నవంబరు 13: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో బుధవారం మధ్యాహ్నం వరకు 36.2 మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో మురుగు కాలువలు పొంగి రహదారులపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షంతో ఆరుతడి పంటలకు మేలు చేకూరింది. పలుచోట్ల చేతికందే దశలో ఉన్న వరి పంట నేలకొరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

సంగంలో భారీ వర్షం

సంగం, నవంబరు 13: మండలంలో భారీ వర్షం కురిసింది. 8గంటలకు తుంపర్ల వర్షంతో ప్రారంభమై తరువాత ఒక్కసారిగా అరగంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో సంగంకొండ మీద నుంచి వర్షపునీరు కిందకు ప్రవహించి రాళ్ల చెలిక కాలనీ మీదుగా రోడ్డు మీదకు ప్రవహించడంతో వీధులన్నీ జలమయం అయ్యాయి.

వరికుంటపాడులో..

వరికుంటపాడు: అల్పపీడన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంతోపాటు చలిగాలులు వీయడంతో పనులపై బయటకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వీధులు, రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

సంగం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలోని రిలయన్స్ పెట్రోలు బంకు సమీపంలో కర్నూలు నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పి రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. ఈ సమయంలో బస్సులో 18మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండగా అదుపుతప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ సంఘటన స్థలానికి వెళ్లి ఎక్స్‌కవేటర్‌తో బస్సును రోడ్డు మీదకు లాగారు. ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించి పంపించారు.

సాగునీటి సంఘం ఎన్నికను నిలిపివేయాలి

జలదంకి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మసముద్రం చెరువు సాగునీటి సంఘం ఎన్నికను నిలుపదల చేయాలని మాజీ వైస్‌ఎంపీపీ తల్లపనేని మధుసూదనరావు నేతృత్వంలో రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దారు కార్యాలయంకు వచ్చారు. అక్కడ తహసీల్దారు లేకపోవడంతో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వే పేరుతో తప్పులుతడకగా భూ రికార్డులు సృష్టించారని వీటితో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆయకట్టుదారుల జాబితాతయారు చేయడం తగదన్నారు. భూరికార్డులు సరిచేసి ఎన్నిక జరపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కంచర్ల వినోద్‌నాయుడు, నాయకులు దివి లోకేష్‌నాయుడు, కూరపాటి మాలకొండయ్యనాయుడు, మాల్యాద్రి పాల్గొన్నారు.

మాలల మహాగర్జన సభ వాల్‌పోస్టర్ విడుదల

కందుకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా కందుకూరులోని మెర్సీ స్కూల్ ఆవరణలో ఈ నెల 17న సాయంత్రం మాలల మహాగర్జనసభ నిర్వహిస్తున్నట్లు మాల ఉద్యోగుల సంఘం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రమేష్ తెలి పారు. ఈ మహాగర్జనలో మాల మహానాడు నాయకులు చిటితోటి శ్రీరాములు, జూపూడి ప్రభాకరరావు, తెలంగాణ చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీదివ్య, మాజీ ఐపీఎస్ అధికారి కే ఆర్ నాగరాజు ముఖ్య వక్తలుగా పాల్గొంటారన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ మాలకొండయ్య, బీవీ, వలేటి మాలకొండయ్య, రామారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ముళ్లకంప

- పాత కక్షల నేపథ్యంలో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు

లింగసముద్రం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీఆర్ కోట పంచాయతీ బ్రాహ్మణపల్లిలో బుధవారం ఓ వ్యక్తి ఇంటి వద్ద ఉన్న ప్రభుత్వ అంతర్గత మట్టి రోడ్డుకు అడ్డుగా ఇరువురు వ్యక్తులు ముళ్లకంప వేశారు. పాత కక్షల నేపథ్యంలో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మాదినేని నర్సయ్య ఇంటి ఎదురుగా ఉన్న ఈ రోడ్డుకు అదే గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు నర్సయ్య, ఆయన కుటుంబ సభ్యులు ఇంటిలోకి వెళ్లే వీలు లేకుండా ముళ్లకంప వేశారు. దీంతో బాధితుడు లింగసముద్రంలో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మహబూబ్ సుభాని ఆదేశాల మేరకు పోలీసులు గ్రామానికి వెళ్లి ముళ్లకంపను తొలగింపజేశారు.



విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

● సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

వింజమూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం నష్టపోతున్నా మని, ఇకనైనా వారి నిర్లక్ష్యం వీడాలని లెక్కలవారిపాలెం, ఊటుకూరు గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం వింజమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 7గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుంటే నిత్యం కరెంటు కోతలతో రైతులు ఇబ్బందిపడుతున్నారని వాపోయారు. ఈ ప్రాంతానికి లైన్‌మన్ లేకపోవడం, ట్రాన్స్‌పార్మర్‌లు మరమ్మతులకి గురైనప్పుడు సకాలంలో విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో పంటలు ఎండుతున్నాయన్నారు. ఎక్కువగా వరి, మొక్కజొన్న తమలపాకు సాగు చేస్తున్నామని, విద్యుత్ సరఫరా సరిగాలేక చాలా పంట నష్టం జరిగే అవకాశం ఉంటుందని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యుత్ సరఫరా సరిగా ఉండడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌పార్మర్లకు కనెక్షన్లు ఎక్కువ కావడంతో తరచూ మరమ్మతులకు గురికావడంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతాంగానికి మేలు జరిగేలా మినీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

గుంతలమయంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు



లింగసముద్రం: కల్యాణమండపం సమీపంలో వర్షాలకు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

లింగసముద్రం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని గ్రామాలలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు, పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. గతంలో గుంతలు పడి అధ్వానంగా ఉన్న ఈ రోడ్లు గతంలోనూ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గుంతలు కాస్తా పెద్దవై ప్రయాణానికి నరకప్రాయంగా మారాయి. వెంగళాపురం నుంచి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు, అలాగే వీఆర్ కోట నుండి చీమలపెంట మీదుగా ఉన్న తాతా హోటల్ వరకు, అక్కడి నుండి మొగిలిచెర్ల వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు, అన్నెబోయిన పల్లి-అంగి రేకులపాడు వరకు, తిమ్మారెడ్డిపాలెం-శింగరపాలెం వరకు, తిమ్మారెడ్డిపాలెం- మాలకొం డరాయునిపాలెం వరకు, విశ్వనాథపురం - వీఆర్‌కోట వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు గుంతలుపడి దారుణంగా దెబ్బతిన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



సీపీఎం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు, నవంబరు 13(ఆంధ్ర జ్యోతి): పట్టణ అభివృద్ధికి తగినచర్య లు తీసుకోవాలని సీపీఎం మహాసభ లో సభ్యులు తీర్మానం చేశారు. బుధ వారం స్థానిక పార్టీ కార్యాల యంలో డి.రామమూర్తి, ఎం.మల్లికార్జున అధ్య క్షతన సీపీఎం పట్టణ 11వ మహా సభలు నిర్వహించారు. ఈ సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య పా ర్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడారు. 35ఏళ్ల కిందట కందుకూరు మున్సిపాలిటీ ఏర్పడినా తగురీతిలో అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. పట్ట ణంలో ట్రాఫిక్‌సమస్య నివారణకు ఉత్తరంగా బైపాస్‌రోడ్డు, మినీ స్టేడియం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మా ణం చేపట్టాలని ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాలు ఆమోదించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న గు ణ్ణంకట్ట కుంటను ప్రక్షాళన చేయాలని, కందుకూరు ఏరియా వైద్యశాల పూర్తిస్థాయిలో ప్రజలకు ఉప యోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కందుకూరులో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కా ర్యక్రమంలో జిల్లా సీపీఎం కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు అజయ్‌కుమార్, ముప్పరాజు కోటయ్య, జీ. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, ఎస్‌ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా పట్టణ కమిటీ కార్యదర్శిగా ఎస్‌ఏ గౌస్‌తో పాటు 13మంది నూతన కమిటీసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డ్రైనేజీలను నిర్మించండి

కావలిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి కొత్త నిర్మాణాలను చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య తెలిపారు. సీపీఎం ప్రజాపోరులో భాగంగా బుధవారం ఆయన ఒంగోలు బస్టాండ్ కూడలిలో పార్టీ నేతలతో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కార మార్గాలపై ప్రజలతో చర్చించారు. ఆయన వెంట నేతలు కృష్ణయ్య, చెన్నయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

పీఎం ఫసల్ భీమా యోజనకు ప్రీమియం చెల్లించండి

లింగసముద్రం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద రైతులు ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి అబ్రహంలింకన్ తెలిపారు. బుధవారం వీఆర్. కోట, అన్నెబోయినపల్లిలోని రైతుసేవా కేంద్రాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. ఎకరా వరి పైరుకు రూ.168/-లు, మినుముకు రూ.38/లు, శనగ పైరుకు రూ.56/-లు, పెసరకు రూ.36/-లు, వేరుశనగకు రూ.60/లు చెల్లించాలన్నారు. పశుగణను ప్రతిరైతు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డా.రూఫీ సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు నజీర్, అహమ్మద్, మార్కెటింగ్ సహాయకులు వినయ్ పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ ఉపసంచాలకులు దేవసేనమ్మ తెలిపారు. అప్పారావుపాళెం, బట్టేపాడులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొ న్నారు. ప్రస్తుత రబీసీజన్‌కు అనువైన వరి రకాలు, విత్తనశుద్ధి, నారుమడుల పెంపకం, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసా యశాఖాధికారి కిషోర్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు అర్చన, ఏ ఝాన్సీరాణి, వీహెచ్ఏ రఫీ పాల్గొన్నారు.

'వెలుగొండ'కు అరకొర నిధుల కేటాయింపుపై ఆందోళన

ఉదయగిరి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మెట్ట జిల్లాల వరప్రసాది అయిన వెలుగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడంపై బుధవారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ మూడు జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీటి కష్టాలు తీర్చే వెలుగొండ ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. వెలుగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు నిలిచిపోగా, సీతారాంసాగర్ ప్రాజెక్టు శిలాఫలకానికే పరిమితమైందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు పచ్చడి మెతుకులు కూడా కరువయ్యాయన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. విద్యుత్ ట్రూఆఫ్ చార్జీలను ప్రభుత్వమే భరించడంతోపాటు ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సీపీఎం, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి కొడె రమణయ్య, రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో ఆందోళన చేస్తున్న సీపీఎం, రైతు సంఘం నాయకులు, కార్మికులు

నేడు ప్రజాప్రతినిధులకు శిక్షణ

సీతారామపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఈనెల 14న స్థానిక మండల కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-26 కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

వింజమూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జ్యోతికొండయ్య తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న క్విజ్ పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న క్రీడా పోటీలు, 19, 20 టాలెంట్ టెస్ట్ ఉంటుందన్నారు.